నేటి కందం- నేటికి అందం

గోవాకు రాష్ట్ర హోదా
కావలెనని కోరినట్టి కర్మతతతులున్
దీవెనగా భావించగ
గోవా రాష్ట్రముగ మారె కూరిమి మిారన్ !!
(30-5-1987 గోవాకు రాష్ట్ర హోదా వచ్చిన రోజు)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటినిజం

తెలుగు దినపత్రిక

మనిషిని చంపివేస్తే
మరణించదు భావం
వేళ్లూని సమాజంలో
విస్తరించు జనజీవం
ఉద్యమాలు లేకుండా
ఉద్దేసుడు క్రాంతి
చీకటి ఉన్నంతవరకు
జ్వలిస్తుంది క్రాంతి
-వేల్పుల నారాయణ
9440433475

చురక



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 30-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:227 పేజీలు:6 వెల: రూ.1/-


# ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం - ప్రధాని మోదీ



కోలకతా, మే 29: భారత్‌లో ఉగ్రవాదం వ్యాప్తికి సహకరించే వారికి 'ఆపరేషన్ సిందూర్' తగిన సమాధానం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైందని పేర్కొన్నారు. సిక్కిం రాష్ట్రంలో పలు అభివృద్ధికారక ప్రాజెక్టులకు నేడు ప్రధాని పశ్చిమ బెంగాల్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. నమ్చి జిల్లాలో రూ.750 కోట్లతో నిర్మించనున్న 500 పడకల జిల్లా ఆసుపత్రి, సాంగా చోలింగ్‌లోని ప్యాసెంజర్ రోప్‌వే, గాంగ్‌టాక్ జిల్లాలోని అటల్ అమృత్ ఉద్యానవనంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

అనంతరం ఆయన సిక్కిం రాష్ట్ర హోదా పొంది 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగిస్తూ,. హిమాలయ రాష్ట్రమైన సిక్కిం దేశానికి గర్వకారణమన్నారు. ఇక్కడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తారని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలే కేంద్రంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల ఈశాన్య రాష్ట్రాల ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఢిల్లీలో జరిగిందన్న విషయాన్ని కూడా మోదీ పేర్కొన్నారు. ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. దీంతో, రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. 'గత నెలలో పహల్గాం దాడి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్.. భారత్‌లో ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసేవారికి తగిన సమాధానం. పహల్గాంలో ఉగ్రవాదులు చేసింది మానవత్వంపై దాడి. ఇప్పుడు ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైంది' అని చెప్పుకొచ్చారు.

## వాతావరణం అనుకూలించకపోవడంతో..

వాస్తవానికి ప్రధాని మోదీ నేడు సిక్కింలో నేరుగా పర్యటించాల్సి ఉంది. అయితే, వాతావరణం అనుకూలించని కారణంగా ఈ పర్యటన రద్దైంది. దీంతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిక్కిం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సాహస క్రీడలకు హబ్‌గా మారే అవకాశాలు సిక్కింకు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. 'గ్యాంగ్‌టక్‌లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో నేను నేరుగా పాల్గొనాలనుకున్నాను. అందుకు వాతావరణం సహకరించలేదు. సిక్కిం సాహస క్రీడలకు కేంద్రంగా మారే అవకాశం ఉంది. మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు కూడా ఈ దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను' అని ప్రధాని పేర్కొన్నారు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదే.. గ్రేట్ ఇండియా ఏర్పాటే లక్ష్యం - రాజ్ నాథ్ సింగ్

న్యూఢిల్లీ, మే 29: పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదేనని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. అక్కడి ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అతి త్వరలో పీవోకేను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఢిల్లీలో నేడు జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పీఓకే ప్రజలకు భారత్‌తో విడదీయరాని, దృఢమైన సంబంధాలున్నాయని ఆయన పునరుద్ఘాటించారు.

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు మన కుటుంబసభ్యులు అని రాజ్‌నాథ్ తెలిపారు. భౌగోళికంగా వేరు పడిన వారు ఎప్పటికైనా ఇండియాలో కలుస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ చాలా బలంగా ఉందన్నారు. పీవోకేలోని చాలా మంది ప్రజలు ఇండియాలో కలవాలని కోరుకుంటున్నారని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

కొంతమంది మాత్రమే దీనిని వ్యతిరేకిస్తున్నారని ఆయన వివరించారు. పీవోకే ప్రజలు ఏదో ఒక రోజు భారత్‌లో ఏకమవుతారని.. ఆ రోజు ఎంతో దూరంలో లేదన్నారు. పీవోకే దానంతట అదే వస్తుందని.. అక్కడున్న వారికి ఇండియాతో దృఢమైన బంధాలు ఉన్నాయని రక్షణ మంత్రి పేర్కొన్నారు. పీవోకేలోని మెజారిటీ ప్రజలు భారత్‌లో కలవాలని కోరుకుంటున్నారని.. కొందరు మాత్రమే తప్పుదారి పట్టారని చెప్పుకొచ్చారు. మనం ఏదైనా చేయగలమని.. అయితే శక్తితో పాటు సంయమనం కూడా చాలా అవసరమని స్పష్టం చేశారు రాజ్‌నాథ్. మేకిన్ ఇండియా ఆవశ్యకత ఏంటో ఆపరేషన్ సిందూర్‌తో అందరూ గ్రహించారని వ్యాఖ్యానించారు.

# మావోయిస్ట్ టాప్ లీడర్ హిడ్మా అరెస్ట్ ..

భువనేశ్వర్, మే 29: మావోయిస్ట్‌లు ఏరివేతలో భద్రతా దళాలు మరో ఘన విజయాన్ని సాధించాయి.. మావోయిస్టు కీలకనేత కుంజమ్ హిద్మాను నేడు అరెస్టు చేశాయి. కోరాపుట్ జిల్లాలోని బైపారిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని దట్టమైన పెటాగుడ అడవిలో ఈ ఆయనను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు..







ఈ ఆపరేషన్ సమయంలో పోలీసులు ఎకె -47 రైఫిల్‌తో సహా పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్ట్ ఒడిశా ఏరియా కమిటీ సభ్యుడు గా ఉన్న హిద్మా, ఈ ప్రాంతంలో జరిగిన ఏడు ప్రధాన హింసాత్మక సంఘటనలతో అతను నిందితుడు.. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది

ఇక మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషర్ కగార్ కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత ఆపరేషన్ కగార్ మరింత దూకుడుగా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఏవోబీ ప్రాంతం వైపు కూడా పెద్ద ఎత్తున దృష్టిసారించారు భద్రతా బలగాలు.

ముఖ్యంగా ఒడిశాలో కొన్ని ప్రాంతాల నుంచి భారీగా పేలుడు పదార్థాలను తీసుకువస్తున్నారన్న విశ్వసనీయ వర్గాల సమాచారంతో పక్కా పథకం ప్రకారం హిడ్మాను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను దండకారణ్యంవైపు తీసుకెళ్తున్నారంటూ హిడ్మాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక ఏవోబీకి సంబంధించి ఆపరేషన్ కగార్‌లో పెద్ద ఎత్తన కీలక నేతలంతా నేలరాలుతున్నారు. గత సంవత్సర కాలంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. అనేమార్లు భద్రతా బలగాలతో మావోయిస్టుల ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అనేక మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు.మావోయిస్టు కీలక నేతలు కూడా ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. చాలా కాలంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతున్న నేపథ్యంలో మావోయిస్టుల వద్ద ఉన్న ఆయుధాలు కూడా పూర్తి స్థాయిలో అడుగంటిన పరిస్థితి. పేలుడు పదార్థాలు, జిలిటెన్ స్టిక్స్, బాంబులకు సంబంధించిన ఎక్స్‌పోసివ్ మెటీరియల్ మొత్తం మావోయిస్టుల వద్ద అడుగంటినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఒడిశా నుంచి పెద్ద సంఖ్యలో పేలుడు పదార్థాలను ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి రవాణా చేస్తున్న సమయంలోనే మావోయిస్టు కీలక నేత హిడ్మాను ఒడిశా పోలీసులు అరెస్ట్ చేశారు.

# నాణ్యత ప్రమాణాలు పెంచి వినియోగదారులను నిలుపుకోవాలి- కిషన్ రెడ్డి

-నూతన గనులను సాధించుకోవడానికి కృషి చేయాలి
-పని సంస్కృతిలో మార్పునకు కార్మిక సంఘాల సహకారం తీసుకోవాలి
-కోలిండియా, సింగరేణి పై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక సమీక్ష
-పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్
-సింగరేణిపై సిఎండి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, మే 29: రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తపరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై నేడు కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి




జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరఫున సంస్థ సిఎండి ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బలరాం సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు.

ఈ సందర్భంగా .కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు.

బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ శ్రీ ఎస్డీ ఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ అవార్డులను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం



-ఉత్తమ చిత్రంగా కల్కి సినిమా
-ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్

ఉత్తమ నటి : నివేదా థామస్ (35 ఇది చిన్న కాదు)
ఉత్తమ దర్శకుడు : నాగ్ అశ్విన్ (కల్కి 2898)
ఉత్తమ సహాయ నటుడు : ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి : శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు : భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు : సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన)






హైదరాబాద్ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో కలిసి జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ మీడియా సమావేశంలో 2024కు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. మొత్తం 1248 నామినేషన్లను పరిశీలించిన కమిటీ.. విజేతలను ఎంపిక చేసింది. తెలంగాణ యుద్ధ నౌక, దివంగత ఉద్యమ నేత గద్దర్ పేరు మీద.. సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తొలిసారి గద్దర్ అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్, ఉత్తమ చిత్రంగా కల్కి సినిమాను కమిటీ ఎంపిక చేసింది.

**తెలంగాణ గద్దర్ అవార్డు విజేతలు(2024)**

ఉత్తమ మొదటి చిత్రం కల్కి
ఉత్తమ రెండోవ చిత్రం పోట్టేల్
ఉత్తమ మూడవ చిత్రం లక్కీ భాస్కర్
బెస్ట్ చిల్డ్రన్స్ ఫిల్మ్ : 35 చిన్న కథకాదు
బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ : యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ నటుడు : అల్లు అర్జున్ (పుష్ప 2)
ఉత్తమ నేపథ్య గాయని : శ్రేయా ఘోషల్ (పుష్ప 2(చూసేకి..))
ఉత్తమ హాస్యనటులు : సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2)
ఉత్తమ బాలనటులు : మాస్టర్ అరుణ్ దేవ్ (35 చిన్న కథ కాదు), బేబీ హారిక
ఉత్తమ కథా రచయిత : శివ పాలడుగు (మ్యాజిక్ షాప్ మూర్తి)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత : వెంకి అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గేయ రచయిత : చంద్రబోస్ (రాజూ యాదవ్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ : విశ్వనాథ్‌రెడ్డి (గామి)

# పాస్ పోర్ట్ వచ్చిన మూడు రోజుల్లో ఇండియాకు రావాలి

-విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావును ఆదేశించిన ధర్మాసనం

న్యూ డిల్లీ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నింధితుడిగా ఉన్న మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. గురువారం ప్రభాకర్ రావు వేసిన పిటిషన్ ను విచారించిన కోర్టు.. ఆయనకు పాస్‌పోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. పాస్ పోర్ట్ వచ్చిన మూడు రోజుల్లో ఇండియాకు రావాలని.. విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావును ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వరకు ప్రభాకర్‌రావును అరెస్ట్ చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం.. తదుపరి విచారణ ఆగస్ట్ 5వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావుకు అక్కడి కోర్టుల షాకిచ్చింది. తనపై రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని.. తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని కోరుతూ ప్రభాకర్ రావు వేసిన పిటిషన్ ను కోర్టు తిరస్కరించింది.

# ఎపిలో ఫ్లాష్ ఫ్లడ్స్ ప్రమాదం - హెచ్చరికలు జారీ

విశాఖపట్నం, మే 29: ఆంధ్రప్రదేశ్ అంతటా నైరుతి రుతుపవనాలు వ్యాపించాయి. దీంతో ఆకాశంలో నల్లని మబ్బులు కమ్మేసి వాతావరణం పూర్తిగా చల్లబడింది? వర్షాలు మరింత జోరందుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా కోస్తాంధ్రలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

## బలపడిన అల్పపీడనం ..

మరోవైపు వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొద్దిసేపటి క్రితం బంగ్లాదేశ్ వద్ద తీరాన్ని దాటింది.. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది, భారీ వర్షాల నేపథ్యంలో ఆకస్మిక వరదలు, కోస్తాంధ్రలో భారీ వర్షాలతో పాటుగా, ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది .

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తారు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## ఏపీకి ఫ్లాష్ ఫ్లడ్స్

ఏపీతో పాటు ఎగువన తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల నేపధ్యంలో ఆకస్మిక వరదల అవకాశం ఉంది. గోదావరి, నాగావళి, వంశధార నదీ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నదీ తీరాలు, సరస్సులు, చెరువులు, కాలువల్లో కొట్టుకుపోయే కేసులను తగ్గించడానికి, ప్రమాదాన్ని కలిగించే నీటి వనరులు తక్షణం గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేసారు.

ఈ హెచ్చరిక బోర్డుల్లో భద్రతా సూచనలు, సహాయం కోసం అత్యవసర నెంబర్ల సమాచారం ఉంటుంది.

ఇక ఎగువ నుంచి వచ్చే నీటితో గోదావరి, కృష్ణా నదుల్లోకి భారీగా నీటిమట్టం పెరుగుతోంది. అలాగే వాగులు వంకలు వరదనీటితో ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

# రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి

-కానీ.. డెలివరీలు మాత్రం ఉండవు

-రక్షణ రంగంలోని కాంట్రాక్టులపై ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ కీలక వ్యాఖ్యలు

న్యూ డిల్లీ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రక్షణ రంగంలోని కాంట్రాక్టులపై ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు.గురువారం దిల్లీలో జరిగిన బిజినెస్ సమ్మిట్‌లో ఏపీ సింగ్ పాల్గొని మాట్లాడారు. 'మేము సత్యమార్గాన్ని ఎంచుకున్నాం. దేవుడు కూడా ఇందులో మాకు తోడుగా ఉన్నాడని భావిస్తున్నా. అందుకే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. ఇది దేశ విజయం. ఈ ఆపరేషన్‌ను త్రివిధ దళాలు పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం నిర్వహించాయి. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి భారతీయుడికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని ఆయన తెలిపారు.ఇదే కార్యక్రమంలో రక్షణ రంగంలోని కాంట్రాక్టులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి కానీ.. డెలివరీలు మాత్రం ఉండవని వ్యాఖ్యానించారు.



ఇక్కడ టైమ్‌లైన్ ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఒక్క ప్రాజెక్టు కూడా సకాలంలో పూర్తైన దాఖలాలు లేవన్నారు. తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైందంటూ తన అసంతృప్తి వెలిబుచ్చారు. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ అందుబాటులోకే రాలేదన్నారు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటి వరకు నమూనా విమానం కూడా రాలేదంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాక్షాత్తు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎదుటే ఎయిర్ చీఫ్ మార్షల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ దేశ విజయం అని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. త్రివిధ దళాలు కలిసి ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి భారతీయుడికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.




# భారతీయ జర్నలిజానికి రెండు శతాబ్దాల ఘన చరిత్ర

(30 మే "హిందీ జర్నలిజం దినోత్సవం" సందర్భంగా)

రెండు దశాబ్దాలకు పూర్వం ఆంగ్లం, పార్సియన్ లాంటి భాషల్లో మాత్రమే పాఠకులకు పత్రికలు అందుబాటులో ఉండేవి. హిందీ భాష అత్యధికంగా మాట్లాడే భారతంలో నాడు హిందీలో పత్రికలు ఉండేవి కాదు. ఈ లోటును గ్రహించిన కాన్పూర్‌కు చెందిన పండిట్ జుగల్ కిషోర్ శుక్లా 30 మే 1826 రోజున కొల్‌కతాలో తొలిసారిగా "ఉదంత్ మార్తాండ్ (ఉద్యమించే సూర్యుడు)" అనే వార పత్రికను అందుబాటులోకి తేవడంతో భారతీయ భాషల్లో పత్రికల విప్లవం ప్రారంభమైంది. ఈ మహత్తర సంఘటనకు గుర్తుగా ప్రతి ఏటా 30 మే రోజున "హిందీ జర్నలిజం దినోత్సవం (హిందీ జర్నలిజమ్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ వేదిక ఆధారంగా హిందీ జర్నలిస్టులు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్లు, కరస్పాండెంట్లు లాంటి వర్గాల త్యాగాలు, అంకితభావాలను గుర్తు చేసుకోవడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలు సహితం కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరుగుతుంది.

## చిన్న ప్రయత్నం ఓ పెద్ద విప్లవానికి నాంది:

నాడు హిందీ పాఠకులు తక్కువగా ఉండడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కేవలం 79 వారాలు మాత్రమే పత్రికను విడుదల చేసి ఆ తర్వాత ఆపి వేయడం జరిగింది. అయినప్పటికీ నాడు జుగల్ కిషోర్ శుక్లా నాటిన చిన్న హిందీ పత్రిక బీజం కాలక్రమంలో విస్తరించి నేడు పాఠకులకు అనేక రకాలైన పత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, టీవీ చానెల్స్ లాంటివి అందుబాటులోకి రావడం జరిగింది. పత్రిక అంటే సమాచార వితరణ మాత్రమే కాదని, ఇవి ప్రజలను ఏకం చేసే శక్తివంతమైన మాధ్యమాలని, సమస్యలను పరిష్కరించే వేదికలని తెలుసుకోవాలి. నేటి పత్రికలు మానవ హక్కులు, సజావుగా ఎన్నికల నిర్వహణ, విద్య, సమకాలీన అంశాలు, రాజకీయం, సామాజిక సమస్యలను బహిరంగ పరిచే వేదికలుగా అమూల్య సేవలను అందిస్తున్నాయి.

## డిజిటల్ స్మార్ట్ యుగంలో పత్రికల మనుగడ:

1826లో ప్రారంభమైన తొలి హిందీ పత్రిక తర్వాత దినదినం అభివృద్ధి చెందుతూ నేడు వందల, వేల పత్రికలు అందుబాటులోకి వచ్చాయి దైనిక్ జగరన్, అమర్ ఉజాల, హిందుస్థాన్, రాజస్థాన్ పత్రిక లాంటివి అనేకం పాఠకులకు సమాచార, విద్య, విజ్ఞాన, సామాజిక చైతన్య విందులను వడ్డిస్తున్నాయి. 1990ల్లో హిందీ టీవీ చానెల్స్ అందుబాటులోకి రావడం, తర్వాత యూట్యూబ్ చానెల్స్, మొబైల్ ఆప్‌లు లాంటి రావడంతో నేడు అరచేతిలో అన్ని పత్రికలు ఇమిడిపోయాయి. హిందీ జర్నలిజం దినం వేదికగా యూనివర్సిటీలు, పత్రికా సంస్థలు, ప్రెస్ క్లబ్‌లు, పాఠక సంఘాలు పలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. డిజిటల్ ఏఐ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న వేళ నేడు పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతూ పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి.

నీతి నిజాయితీ, జవాబుదారీతనం, ప్రజా సేవ అనే పునాదుల మీద జర్నలిజం నిలబడాలి. పత్రికలు పక్షపాతంతో దారి తప్పితే ప్రజలకు భారీ నష్టం జరుగుతుంది. చీకటిలో బతుకుతున్న అభాగ్యుల జీవితాల్లో పత్రికలు వెలుగులు నింపాలి. ప్రతి వార్తను క్షుణ్ణంగా అందిస్తున్న డిజిటల్ విప్లవంతో పత్రికల మనుగడ మసకబారరాదు. పత్రికల ప్రాధాన్యాన్ని ప్రత్యామ్నాయం లేదని గమనించాలి. పత్రికలు పోషించడానికి ప్రజలు పాఠకులుగా మారి ముందుకు రావాలి.

# గర్వంగా ప్రకటిద్దాం.. మన బ్రాండ్ 'మేడ్ ఇన్ ఇండియా': ప్రధాని

న్యూఢిల్లీ, మే 29:గుజరాత్ పట్టణాభివృద్ధిని చాటే 20 ఏళ్ల వేడుకనుద్దేశించి గాంధీనగర్‌లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ప్రసంగించారు. పట్టణాభివృద్ధి సంవత్సరం- 2005కు ఇరవై ఏళు పూర్తయిన సందర్భంగా పట్టణాభివృద్ధి సంవత్సరం-2025ను ఆయన ప్రారంభించారు. సమావేశాన్నుద్దేశించి ప్రసంగిస్తూ.. వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్, గాంధీనగర్‌లలో పర్యటన సందర్భంగా ఆపరేషన్ సిందూర్ విజయ గర్జనలు, రెపరెపలాడుతున్న మువ్వెన్నెల పతాకాలతో వెల్లివిరుస్తున్న దేశభక్తిని రెండు రోజులుగా ఆస్వాదిస్తున్నానన్నారు. ఈ కనువిందైన దృశ్యం ఒక్క గుజరాత్‌కే పరిమితం కాలేదనీ.. భారత్ నలుమూలలా, ప్రతి భారతీయుడి హృదయమూ ఇదే రకమైన భావనతో ఉప్పొంగుతోందని ఆయన పేర్కొన్నారు. "ఉగ్రవాదమనే కంటకాన్ని నిర్మూలించాలని సంకల్పించిన భారత్ దృఢ నిశ్చయంతో దానిని నెరవేర్చింది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

దేశాన్ని మూడు భాగాలుగా విభజించిన వెంటనే 1947లోనే భారత్‌పై జరిగిన తొలి ఉగ్ర దాడి జరిగిందని శ్రీ మోదీ గుర్తుచేశారు. ఓ భాగంలో పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చిందని విమర్శించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)ను తిరిగి స్వాధీనం చేసుకునే వరకు భారత సైన్యం ఆగవద్దన్న సర్దార్ పటేల్ లక్ష్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. అయితే ఆ సమయంలో పటేల్ సలహాను పాటించలేదన్నారు. ఈ ఉగ్రవాద వారసత్వమే 75 ఏళ్లుగా కొనసాగుతోందని, పహల్గాం దాడి దాని వికృత రూపమేనని శ్రీ మోదీ పేర్కొన్నారు. దౌత్యపరమైన చర్యలతోపాటు యుద్ధంలో భారత సైనిక శక్తినీ ఎప్పటికప్పుడు పాకిస్థాన్ చవిచూస్తోందన్నారు. మూడు సార్లూ భారత సాయుధ దళాలు పాకిస్థాన్‌ను నిశ్చయాత్మకంగా ఓడించాయని, ప్రత్యక్ష సైనిక పోరాటంలో ఆ దేశం విజయం సాధించలేదని దీంతో స్పష్టమైందని అన్నారు. బలహీనతను అంగీకరించిన పాక్ పరోక్ష యుద్ధానికి పాల్పడిందని శ్రీ మోదీ అన్నారు. సైనిక తరహా శిక్షణ పొందిన ఉగ్రవాదులు భారత్‌లో చొరబడి.. తీర్థయాత్రలకు వచ్చినవారినీ, నిరాయుధులైన అమాయక పౌరులనూ లక్ష్యంగా చేసుకున్నారని ఆయన వివరించారు.

భారత సాంస్కృతిక విలువలు అత్యున్నతమైనవన్నారు. ప్రపంచమంతటినీ కుటుంబంగా భావించే వసుధైక కుటుంబమే మన తాత్వికత అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. శతాబ్దాలుగా ఇదే సంప్రదాయాన్ని నిలబెట్టుకుంటున్న భారత్ పొరుగు దేశాలతో శాంతియుత, సామరస్యపూర్వక సంబంధాలనే కాంక్షిస్తుందని పేర్కొన్నారు. భారత్ ఎప్పుడూ శాంతిని, స్థిరత్వాన్నే కోరుకుంటుందనీ.. కానీ పదే పదే ఎదురవుతున్న సవాళ్లతో, వాటిని సమర్థంగా తిప్పికొట్టడం అనివార్యంగా మారిందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. గతంలో పిలిచే పరోక్ష యుద్ధాల తీరు ప్రస్తుతం, ముఖ్యంగా మే 6 సంఘటనల అనంతరం మారిందని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి పరిణామాలను గమనిస్తే ఆ చర్యలను పరోక్ష యుద్ధమని చెప్పడం పొరపాటే అన్నారు. ఇకపై ఇది కేవలం పరోక్ష యుద్ధం మాత్రమే కాదనీ.. ఉద్దేశపూర్వకంగా పాకిస్థాన్ చేపట్టిన సైనిక వ్యూహంగా ఇటీవలి సంఘటనలతో తేటతెల్లమైందని స్పష్టం చేశారు. తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను గుర్తించి, పూర్తి పారదర్శకతతో, దేశీయంగా ఎలాంటి సందేహానికీ తావులేకుండా కెమెరా చిత్రీకరణతో 22 నిమిషాల్లోనే భారత్ వాటిని తుడిచిపెట్టిందని ఆయన తెలిపారు. మే 6 నాటి చర్యల అనంతరం పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల అంత్యక్రియలు పూర్తి గౌరవలాంఛనాలతో జరిగాయని, వారి శవపేటికలను జాతీయ జెండాలతో కప్పారని, ఆ దేశ సైన్యమూ సెల్యూట్ చేసిందని ఆయన ఎత్తిచూపారు. ఇవి కేవలం ఉగ్రవాద కార్యకలాపాలే కాదని, నిర్మాణాత్మక యుద్ధ విధానంలో భాగమని చెప్పడానికి ఆ చర్యలు స్పష్టమైన సంకేతాలుగా ఉన్నాయన్నారు. అలాంటి చర్యలకు పాల్పడితే నిశ్చయాత్మకంగా స్పందిసామని స్పష్టం చేశారు.

సంక్షోభ సమయాల్లో ఆపన్నహస్తాన్ని అందిస్తూ.. అందరి పురోగతిని, సంక్షేమాన్నే భారత్ ఎల్లప్పుడూ కాంక్షించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అయినా భారత్ చాలావరకు హింసాత్మక ప్రతీకార చర్యలను ఎదుర్కొన్నదని వ్యాఖ్యానించారు. దశాబ్దాలుగా దేశం ఎలా నిర్లక్ష్యానికి గురయిందో యువతతరం గుర్తించాలని కోరారు. నిలిపివేసిన సింధూ నదీ జలాల ఒప్పందం గురించి మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లో జలవనరులకు సంబంధించిన అంశాలను ప్రధానమంత్రి ఎత్తిచూపారు. నదులపై ఆనకట్టలు నిర్మించినప్పటికీ, సరైన నిర్వహణ లేకుండా, పూడిక తీయకుండా అరవై ఏళ్లుగా వాటిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నీటి నియంత్రణ కోసం ఉద్దేశించిన గేట్లు తెరవకుండానే ఉంచారని, దీనివల్ల పూర్తి వినియోగ స్థాయి నుంచి కేవలం రెండూ మూడు శాతానికే నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. న్యాయబద్ధమైన నీటి వాటా భారతీయులకు దక్కాలని స్పష్టం చేశారు. మరియు ఇంకా ముఖ్యమైన చర్యలు తీసుకోవలసి ఉన్నప్పటికీ, ప్రారంభ చర్యలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఈ దిశగా చర్యలు ఇప్పుడే మొదలయ్యాయని, ఇంకా విశేషమైన చర్యలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు.

ఎలాంటి శత్రుత్వాన్నీ భారత్ వాంఛించదనీ.. శాంతి, శ్రేయస్సులనే దేశం కోరుకుంటోందని స్పష్టం చేసిన శ్రీ మోదీ.. పురోగతికీ, అంతర్జాతీయ శ్రేయస్సుకూ దేశం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. భారత్ తన ప్రజల సంక్షేమానికి దృఢ సంకల్పంతో కట్టుబడి ఉందన్నారు. మే 26వ తేదీని ప్రస్తావిస్తూ, 2014లో తాను ప్రధానమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని శ్రీ మోదీ గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానంలో ఉంది. కోవిడ్-19పై పోరాటం, పొరుగు దేశాలతో ఇబ్బందులు, ప్రకృతి వైపరీత్యాల వంటి సవాళ్లను దేశం ఎదుర్కొన్నదన్నారు. ఎన్ని అడ్డంకులున్నా భారత్ శరవేగంగా ఆర్థిక వృద్ధిని సాధించి 11 నుంచి నాలుగో స్థానానికి ఎదిగిందని వివరించారు. దేశ అభివృద్ధి లక్ష్యాన్ని, పురోగతిపట్ల అచంచలమైన నిబద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. తన మూలాలు గుజరాత్‌లోనే ఉన్నాయని గుర్తుచేసుకుంటూ.. ఇక్కడ పెరిగిన తాను ఎన్నో పాఠాలు, విలువలూ నేర్చుకున్నానన్నారు. తమ ఆకాంక్షలను నెరవేర్చగలనన్న నమ్మకాన్ని ప్రజలు తనపై ఉంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి అభ్యున్నతి కోసం శ్రద్ధాసక్తులతో పనిచేస్తూనే ఉంటానని ప్రతినబూనారు.

పట్టణాభివృద్ధిపట్ల గుజరాత్ ప్రభుత్వ అంకితభావంపై ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఈ కార్యక్రమాన్ని 2005లో ప్రారంభించిందని, ఇప్పుడు ఈ పురోగతికి రెండు దశాబ్దాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. విజయోత్సవాలకే పరిమితం కాకుండా, గత 20 ఏళ్ల అనుభవాలతో తర్వాతి తరం కోసం భవిష్యత్ కేంద్రీకృతంగా తగిన పట్టణాభివృద్ధి ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందని ఆయన వివరించారు. ఇప్పుడు గుజరాత్ ప్రజల ముందుంచిన ఈ ప్రణాళిక సుస్థిర పురోగతి దిశగా నిర్మాణాత్మక లక్ష్యాలను సూచిస్తుందన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టణాభివృద్ధి వ్యూహాన్ని రూపొందించడంలో అంకితభావంతో కృషిచేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, వారి బృందాన్ని ఆయన అభినందించారు.

భారత గణనీయమైన ఆర్థిక వృద్ధిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ.. అంతర్జాతీయ పోటీదారులను అధిగమించడం గర్వకారణమని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఆరు నుంచి అయిదో స్థానానికి చేరుకున్న వేళ దేశ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఉత్సాహం వెల్లివిరిసిందని గుర్తుచేసుకున్నారు. బ్రిటన్ వలస పాలనలో ఉన్న భారత్ ఆ దేశాన్ని అధిగమించడం చరిత్రాత్మకమైన విజయమని శ్రీ మోదీ చెప్పారు. ప్రస్తుతం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌పై.. త్వరలో మూడో స్థానానికి చేరుకోవాల్సిన బాధ్యత మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుందని, వందేళ్ల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని సంపన్నమైన, శక్తిమంతమైన దేశంగా అంతర్జాతీయ గుర్తింపును పొందుతుందని ఆయన పునరుద్ఘాటించారు. స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రస్తావిస్తూ.. భగత్ సింగ్, రాజ్‌గురు, నేతాజీ సుభాష్ చంద్ర బోస్, వీర సావర్కర్, శ్యామ్‌జీ కృష్ణవర్మ, మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ వంటి నాయకుల త్యాగాలను శ్రీ మోదీ వివరించారు. నాటి 25-30 కోట్ల ప్రజలు దృఢనిశ్చయులై పోరాడి ఉండకపోతే.. 1947లో స్వాతంత్ర్యం సాధ్యం కాకపోయి ఉండేదేమో అన్నారు. గత తరాలు 20-35 ఏళ్లలో వలస పాలకులను తరిమికొట్టగలిగాయని, నేడు 140 కోట్ల ప్రజానీకం వచ్చే 25 ఏళ్లలో అభివృద్ధి చెందిన భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకోగలరని ఆయన స్పష్టం చేశారు. 2035ను దృష్టిలో ఉంచుకుని గుజరాత్ 75వ వార్షికోత్సవానికి ప్రణాళికలు రూపొందించడం అత్యావశ్యకమని శ్రీ మోదీ పేర్కొన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, విద్య, క్రీడల వంటి రంగాలలో రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఇప్పుడే సన్నాహాలు మొదలుపెట్టాలని ఆయన ప్రముఖంగా సూచించారు. దేశ వృద్ధి పథానికి అనుగుణంగా గుజరాత్ పురోగతి ఉండేలా సమష్టి సంకల్పంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2036 లో ఒలింపిక్స్ నిర్వహించాలన్న భారత ఆకాంక్షలను కూడా ఆయన ప్రస్తావించారు. అంతర్జాతీయ నేతృత్వం దిశగా భారత సంసిద్ధతను ఇది స్పష్టం చేస్తోంది.

రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి గుజరాత్ అద్భుతమైన ప్రయాణాన్ని ప్రధానమంత్రి వివరించారు. మొదట్లో రాష్ట్ర భౌగోళిక, ఆర్థిక పరిమితులను ఎత్తిచూపుతూ గుజరాత్ అభివృద్ధి సమర్థతపై చాలామంది సందేహాలు లేవనెత్తారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఉప్పు ఉత్పత్తికి పేరు పొందిన గుజరాత్ రాష్ట్రం నేడు వజ్రాల పరిశ్రమలో అంతతర్జాతీయంగా అగ్రగామిగా ఉందన్నారు. నిర్మాణాత్మక ప్రణాళిక, వ్యూహాత్మక కార్యక్రమాలే ఈ విజయానికి కారణమన్నారు. పాలనపరమైన సవాళ్లను కూడా ప్రధానమంత్రి చర్చించారు. ప్రభుత్వ విభాగాలు విడివిడిగా ఉండడం చాలావరకు పురోగతికి ఆటంకం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ విభాగాల సమష్టి కృషితో కూడిన విధానం అత్యావశ్యకమని, అందులో అన్ని మంత్రిత్వ శాఖల నడుమ సమర్థమైన సహకారానికి అవకాశముంటుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 2005లో పట్టణాభివృద్ధి, మరో ఏడాది బాలికల విద్య, మరో దశలో పర్యాటకం వంటి కేంద్రీకృత కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఆయా సంవత్సరాలను కేటాయించిన గుజరాత్ నమూనాను ఆయన ఉదాహరించారు. 'కుచ్ దిన్ తో గుజారో గుజరాత్ మే' కార్యక్రమాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. పర్యాటక రంగానికి ఊతమివ్వడంలో ఇది దోహదపడింది. దీని ద్వారా సోమనాథ్, ద్వారక, అంబాజీ వంటి క్షేత్రాలు విశేషంగా అభివృద్ధి చెందాయి. పట్టణాభివృద్ధిలో, ముఖ్యంగా అహ్మదాబాద్ విషయంలో తన అనుభవాలను ప్రధానమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. అక్కడ రవాణా విస్తరణకు మొదట్లో ప్రతిఘటన ఎదురైందన్నారు. అహ్మదాబాద్‌లో ఎర్ర బస్సులను నగరం బయటా తిరిగేలా చేయడానికి ప్రయత్నించగా మొదట్లో అధికారుల నుంచీ, రాజకీయపరంగానూ అడ్డంకులు ఎదురయ్యాయని.. కానీ పట్టుదలతో ముందుకెళ్లడంతో మౌలిక సదుపాయాలు విశేషంగా అభివృద్ధి చెందాయని వివరించారు. అదేవిధంగా నగరవ్యాప్త అభివృద్ధి కోసం ఆక్రమణలను తొలగించడంలో ఎదురైన సవాళ్లను వివరించారు. మొదట్లో ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందనీ, అయితే ప్రయోజనాలను చూసిన తర్వాత వారే విస్తృతంగా మద్దతిచ్చారని తెలిపారు.

గుజరాత్‌లో పట్టణ పునరుద్ధరణ చర్యలకు ముఖ్యంగా రాజకీయ ప్రత్యర్థుల నుంచి, మీడియా నుంచి ఎదురైన విస్తృత ప్రతిఘటనను ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే, సమగ్రతతో, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా నాయకులు నిర్ణయాలు తీసుకుంటే.. దీర్ఘకాలిక ఫలితాలే వాటిని ధ్రువీకరిస్తాయని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగులుతాయన్న భయం మొదట్లో ఉన్నప్పటికీ, పట్టణాల్లో సమూల మార్పుల దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో ఎన్నికల్లో విజయాలతోపాటు విస్తృతమైన ప్రశంసలు కూడా లభించాయని శ్రీమోదీ చెప్పారు. నిరంతర పురోగతిపట్ల భారత నిబద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. నాలుగో స్థానం నుంచి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్‌పై అంచనాలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆ ఆశయాలను దృఢ సంకల్పంతో కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

జనాభా పెరిగి విస్తరించడం కన్నా.. ఆర్థిక వృద్ధికి నిలయాలుగా పట్టణ కేంద్రాలు ఎదగాలని చెబుతూ.. "ఆర్థిక కార్యకలాపాలకు నగరాలు క్రియాశీలమైన కేంద్రాలుగా ఉండాలి, మార్పు దిశగా పురపాల సంస్థలు ప్రభావవంతమైన ప్రణాళికలు రూపొందించుకోవాల" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మున్సిపల్, మెట్రోపాలిటన్ అధికారులు తమ నగరాల కోసం ఆర్థిక వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన కోరారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితిని అంచనా వేసి, ఏడాది లోపు దానిని మెరుగుపరచడానికి వ్యూహాలను రూపొందించాలని, ఇందుకోసం తయారీ వస్తువుల నాణ్యతను మెరుగుపరచడంతోపాటు ఆర్థిక కార్యకలాపాలకు కొత్త మార్గాలను గుర్తించడంపై దృష్టి సారించాలని శ్రీ మోదీ సూచించారు. కేవలం వాణిజ్య సముదాయాలను నిర్మించడం కన్నా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు పట్టణ సంస్థలు చేయూతనివ్వాలని, స్థానిక మార్కెట్లలో వాటి విలువను మరింత పెంచేలా కార్యక్రమాల అమలు కోసం సమగ్ర అధ్యయనాలు నిర్వహించాలని పేర్కొన్నారు. సాంప్రదాయకంగా పెద్ద పరిశ్రమలు మెట్రోపాలిటన్ ప్రాంతాల చుట్టూ పెరుగుతున్నప్పటికీ, దాదాపు రెండు లక్షల అంకుర సంస్థలు చాలావరకు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఉండడం విశేషమైన మార్పును సూచిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. వీటిలో చాలావరకు మహిళల నేతృత్వంలోనే ఉన్నాయని గర్వంగా ప్రకటించారు. ఆర్థిక, వ్యవస్థాపక విప్లవంలో ఇదొక విశేషమైన పరిణామమని పేర్కొన్నారు. విద్య, క్రీడల్లో కూడా ఇదే పురోగతిని గమనించవచ్చని శ్రీ మోదీ చెప్పారు. పట్టణ ఆర్థిక వ్యవస్థలో మార్పులపై దృష్టి సారించడం వల్ల నాలుగో స్థానం నుంచి మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత ప్రయాణం వేగవంతమవుతుందన్నారు. ఈ విజయాన్ని సాధించడంలో స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడం కీలకమని పునరుద్ఘాటించారు.

పటిష్ఠమైన పాలనా నమూనా అవసరాన్ని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. కొన్ని శక్తులు పాతుకుపోయిన మనస్తత్వాలతో చారిత్రాత్మకంగా భారతదేశ సామర్థ్యాన్ని బలహీనపరచడానికి ప్రయత్నించాయని, సైద్ధాంతిక వ్యతిరేకత తరచూ అభివృద్ధి విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటనకు దారితీసిందని, ప్రతి కార్యక్రమాన్ని విమర్శించడం ఒక అలవాటుగా మారిపోయిందని ఆయన అన్నారు. పట్టణాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించిన ఆయన, వరిపాలనలోని అడ్డంకులను అధిగమించడానికి ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమాన్ని (ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్) ఎలా ప్రారంభించారో వివరించారు. సుమారు 100 జిల్లాలను అభివృద్ధి సంబంధిత 40 ప్రమాణాలను ఆధారంగా తీసుకుని గుర్తించామని ప్రధాని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యూహంతో ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమం ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాలకు కూడా ఆదర్శంగా మారిందని, సమర్థవంతమైన పాలనపై విలువైన సూచనలు అందిస్తున్నదని ఆయన అన్నారు.

ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించడంలో టూరిజం ప్రాముఖ్యతను ప్రధానమంత్రి స్పష్టం చేశారు., గుజరాత్ లో వచ్చిన మార్పును ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకప్పుడు ఎడారి భూభాగం కారణంగా విస్మరించిన కచ్ ఇప్పుడు పర్యాటక కేంద్రంగా ఎలా మారిందో వివరించారు. ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం ఏర్పాటు వంటి భారీ స్థాయి కార్యక్రమాలు కొత్త అవగాహనలను పెంపొందించాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలకు ఊతమిచ్చాయని ఆయన చెప్పారు. వడ్నగర్ వంటి ప్రాచీన ప్రాంతాలకు ఉన్న చారిత్రాత్మక ప్రాధాన్యతను కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్కడి మ్యూజియాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వారసత్వ కేంద్రంగా ఆయన పేర్కొన్నారు. భారత దేశ సముద్ర వారసత్వాన్ని ప్రస్తావిస్తూ, ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద సముద్ర చారిత్రక మ్యూజియాల్లో ఒకటైన లోథల్ గురించి ఆయన మాట్లాడారు. గిఫ్ట్ సిటీ ఆలోచనను మొదట ప్రతిపాదించినప్పుడు ఎన్నో సందేహాలు వ్యక్తమయ్యాయని, అయితే, అది ఇప్పుడు ఆర్థిక కేంద్రాలకు ఒక ప్రమాణంగా మారిందని ప్రధాని చెప్పారు. వినూత్న ఆలోచనలను ధైర్యంతో, విశ్వాసంతో అమలు చేసినప్పుడే అర్థవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. సబర్మతి రివర్‌ఫ్రంట్, ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియం నిర్మాణం, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి అనేక విజయవంతమైన భారీ ప్రాజెక్టులను ప్రధాని ప్రస్తావించారు. మార్పు తీసుకురాగల ప్రాజెక్టులను అమలు చేయడంలో భారత్ సామర్థ్యాన్ని ఇవి చాటుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుపై తన అపార నమ్మకాన్ని ఆయన మరోసారి వ్యక్తం చేస్తూ, దేశం గణనీయమైన అభివృద్ధిని సాధించగలదన్న విశ్వాసాన్ని పునరుద్ఘాటించారు.

గతంలో జరిగిన కార్యక్రమాలను పునఃసమీక్షించుకునే అవకాశం కల్పించిన గుజరాత్ ప్రభుత్వానికి ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశ అభివృద్ధిలో గుజరాత్ కీలక పాత్రను ప్రముఖంగా తెలిపారు. దేశం కోసం ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం కొనసాగించాలని ఆయన రాష్ట్రాన్ని కోరారు భారతదేశ ఉజ్వల భవిష్యత్తుపై తన నమ్మకాన్ని పునరుద్ఘాటించారు.

మే 6న ప్రారంభమైన ఆపరేషన్ సిందూర్ ప్రాముఖ్యతను వివరిస్తూ, ఇది మొదట ఊహించిన పరిధిని మించిపోతుందని, దేశ అభివృద్ధికి జీవితాంత సంకల్పాన్ని ప్రతిబింబించే కార్యక్రమంగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2047లో 100 సంవత్సరాల స్వాతంత్ర వేడుకల నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న దృఢ సంకల్పాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుతం నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉన్న భారత్, మూడో స్థానానికి ఎదగాలన్న లక్ష్యాన్ని ప్రధానమంత్రి వెల్లడించారు. దీని కోసం విదేశీ ఉత్పత్తులపై ఆధారపడడాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# రాజారెడ్డికి విజయమ్మ, షర్మిల నివాళులు



అమరావతి, మే 29:వైఎస్ రాజారెడ్డి శతజయంతి వేడుకలకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైయస్ విజయమ్మ, కుమార్తె వైఎస్ షర్మిల రెడ్డిలు గురువారం హాజరై పట్టణంలోని డిగ్రీ కాలేజ్ రోడ్డు సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో వైయస్ రాజారెడ్డి శతజ యంతి కేకును వారు కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ? వైఎస్ రాజారెడ్డి అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు లేరన్నారు. పులివెందుల ప్రజల కోసం ఆయన ఎప్పుడూ తపించేవారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పట్టణ అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ సిబ్బందిపై తిరుగబడ్డ ఏనుగులు

**-ఇద్దరు గార్డులకు తీవ్ర గాయాలు**
**-బోయినపల్లి అటవీ ప్రాంతంలో ఘటన**
**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు**

తిరుపతి, మే 29: తిరుపతి జిల్లాలో ఏనుగుల గుంపు మరోసారి బీభత్సం సృష్టించాయి. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలంలో ఏనుగులు నేడు హల్‌చల్ చేశాయి.



ఈ మేరకు స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారంతో అక్కడికి వెళ్లిన అటవీశాఖ సిబ్బంది.. డ్రోన్ కెమెరాల ద్వారా ఏనుగుల గుంపును గుర్తించిన అటవీశాఖ సిబ్బంది వాటిని అడవిలోనికి తరిమేసేందుకు ప్రయత్నిస్తూ ఉండగా అటవీశాఖ సిబ్బందిపై ఏనుగులు తిరగబడ్డాయి. దీంతో ఫారెస్ట్ సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరిగెత్తారు.

ఈ దాడి ఘటనలో ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గాయపడ్డారు. సెక్షన్ ఆఫీసర్ మునుస్వామి, గార్డు లక్ష్మీప్రసాద్‌కు కూడా గాయాలయ్యాయి. బోయినపల్లి అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ క్రమంలో ఉస్తికాయలపెంట, కోటకాడపల్లి, యలమంద గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

# 2023-24 తో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7.9 శాతం మేర తగ్గిన బొగ్గు దిగుమతులు

న్యూఢిల్లీ, మే 29:గడచిన ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7.9 శాతం అంటే మొత్తం రూ. 243.62 మిలియన్ టన్నులు (ఎంటీ) మేర బొగ్గు దిగుమతులు తగ్గాయి. గతేడాది ఈ విలువ 264.53 ఎంటీలుగా ఉంది. ఈ తగ్గుదల కారణంగా సుమారు 7.93 బిలియన్ డాలర్లు (రూ.60681.67 కోట్లు) మేర విదేశీ మారకద్రవ్యం ఆదా అయింది. విద్యుత్ రంగాన్ని మినహాయిస్తే.. ముఖ్యంగా అనియంత్రిత రంగంలో ఈ తగ్గుదల ఎక్కువగా కనిపించింది. గతేడాదితో పోలిస్తే 8.95 శాతం మేర ఈ దిగుమతులు తగ్గాయి. అలాగే గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరానికి బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి 3.04 శాతం మేర పెరిగినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గు మిశ్రమాన్ని తయారు చేయడం కోసం థర్మల్ విద్యుత్ కేంద్రాల చేసుకునే దిగుమతులు 41.4 శాతం మేర తగ్గాయి. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని మెరుగుపరచడంలో భారత్ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ఇది తెలియజేస్తుంది.

దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి, దిగుమతులను తగ్గించడానికి వాణిజ్య బొగ్గు తవ్వకం, మిషన్ కోకింగ్ కోల్‌తో సహా వివిధ కార్యక్రమాలను భారత ప్రభుత్వం చేపడుతోంది. ఈ ప్రయత్నాలే గడచిన ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో 5 శాతం వృద్ధికి కారణమయ్యాయి.

వేగంగా వృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతు అందించడంలో బొగ్గు రంగం కీలకపాత్రను పోషిస్తోంది. విద్యుత్, ఉక్కు, సిమెంట్, తదితర ప్రధాన పరిశ్రమలకు బొగ్గు ప్రాథమిక ఇంధన వనరుగా పనిచేస్తోంది.



# డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ సంప్రదాయక వైద్య వ్యూహానికి కట్టుబడి ఉంటాం

## -78వ వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో నిబద్ధత పునరుద్ఘాటించిన భారత్

న్యూఢిల్లీ, మే 29:"ఆరోగ్యసంరక్షణ విషయంలో ఒకే ప్రపంచం" ఇతివృత్తంతో జెనీవాలో 78వ వరల్డ్ హెల్త్ అసెంబ్లీని (డబ్ల్యూహెచ్ఏ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ పాల్గొంది. స్వాస్థ్య సంరక్షణకు ఉద్దేశించిన సమగ్ర విధానంలో భాగంగా సాంప్రదాయక వైద్య వ్యవస్థలను బలపరచడానికి తన బలమైన కట్టుబాటును కొనసాగించనున్నట్లు పునరుద్ఘాటించింది. జెనీవాలోని ఐక్యరాజ్యసమితిలో శాశ్వత ప్రతినిధి శ్రీ అరిందమ్ బాగ్చీ భారత్ పక్షాన మాట్లాడుతూ... 2025?2034 మధ్య కాలానికి నూతన డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ సాంప్రదాయక వైద్య వ్యూహం ఆమోదం లభించడాన్ని స్వాగతించారు. నిరూపణ ఆధారిత సాంప్రదాయక పద్ధతులకు జాతీయ, ప్రపంచ ఆరోగ్య విధానాల్లో స్థానం కల్పించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారత్ అనుసరిస్తున్న విధానం ఇతర దేశాలకు ఆచరణీయ నమూనా కాగలదని కార్యక్రమంలో చెప్పారు. ఆధునిక వైద్యానికి తోడు, వైజ్ఞానికంగా చెల్లుబాటు అవుతూ ఉన్న ఆయుర్వేద, యోగా, యూనానీ, సిద్ధ వంటి సాంప్రదాయక వైద్య వ్యవస్థలను ఆదరించే విధానాన్ని భారత్ అవలంబిస్తోంది. ఇదివరకు రూపొందించిన డబ్ల్యూహెచ్ఓ సాంప్రదాయక వైద్య వ్యూహం (టీఎం స్ట్రాటజీ 2014?2023)ను ఆచరించడంలో భారత్ బలమైన నాయకత్వాన్ని కనబరచిందని శ్రీ బాగ్చీ చెప్పారు. దీనికి తరువాయిగా తీసుకు వచ్చే విధానానికి మద్దతునిస్తామని ఆయన అన్నారు.

గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ సాంప్రదాయక వైద్య కేంద్రం (జీటీఎంసీ)ని ఏర్పాటు చేయడం ప్రపంచ సాంప్రదాయక వైద్య (టీఎం) అనుబంధ విస్తారిత వ్యవస్థకు భారత్ అందించిన ముఖ్య తోడ్పాటును ప్రతిబింబించింది. భారత ప్రభుత్వం అండదండలతో 2022లో ప్రారంభించిన ఈ కేంద్రాన్ని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్-జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ తరహా సంస్థల్లో ఈ కేంద్రమే మొట్టమొదటిది. ఇది సమాచార విశ్లేషణ, విధానపరమైన మద్దతు, ప్రమాణాల నిర్దేశం, పరిశోధన పూర్వక సహకారం అంశాల్లో కీలక పాత్రను పోషిస్తోంది.

ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ హెల్త్ ఇంటర్వెన్షన్స్ (ఐసీహెచ్ఐ)లో భాగంగా ఒక ప్రత్యేక సాంప్రదాయక వైద్య మాడ్యూల్‌కు సంబంధించిన పనులను మొదలుపెట్టడానికి డబ్ల్యూహెచ్ఓకు, ఆయుష్ మంత్రిత్వ శాఖకు మధ్య ఒక డోనార్ అగ్రిమెంటు కుదరడం ఈ సంవత్సరం చోటు చేసుకున్న ఒక ప్రధాన ఘట్టం. ఈ సరికొత్త అధ్యాయాన్ని ప్రధాని శ్రీ మోదీ తన 'మన్ కీ బాత్' ప్రసంగంలో ప్రశంసిస్తూ, ఇది ఆయుష్ వైద్య చికిత్స పద్ధతులు ఒక శాస్త్రీయమైన, ప్రామాణీకృత విధానంలో ప్రపంచ వ్యాప్తంగా ఆదరణకు నోచుకోవడానికి వీలు కల్పించగలదన్నారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచా మాట్లాడుతూ, "ప్రపంచ వ్యాప్తంగా సాంప్రదాయక వైద్యం ఏకీకరణ చెందే ప్రక్రియలో తన వంతుగా తోడ్పాటును అందిస్తుండడం భారత్‌కు గర్వంగా ఉంది. వైజ్ఞానిక విశ్వసనీయతను పెంచి, ఆయుష్ పద్ధతులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించడానికి మార్గాన్ని ఐసీహెచ్ఐ మాడ్యూల్ సుగమం చేస్తుంది. అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగిపోయే, సురక్షిత, నిరూపణ ఆధారిత సాంప్రదాయక ఆరోగ్యసంరక్షణ దిశగా డబ్ల్యూహెచ్ఓ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతివ్వడానికి మేం కట్టుబడి ఉన్నాం" అన్నారు.

డబ్ల్యూహెచ్ఓ జారీ చేసిన వార్తా ప్రకటనలో పేర్కొన్న ప్రకారం- నియంత్రణను పెంచడానికి, సముచిత సందర్భాల్లో సాంప్రదాయక వైద్య సేవలను ఏకీకరించడానికి, దేశీయ జ్ఞానాన్ని పరిరక్షించడానికి, పర్యావరణ సుస్థిరత్వం కోసం పాటుపడడానికి, జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి సభ్య దేశాలకు డబ్ల్యూహెచ్ఓ నూతన వ్యూహం ప్రోత్సాహాన్ని అందిస్తుంది. భారత్ అమలుచేస్తున్న కార్యక్రమాలు ఈ సిద్ధాంతాలతో తులతూగుతున్నాయి. ఇది ప్రపంచ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సాంప్రదాయక వైద్యాన్ని విస్తరించడంలో ఇండియా నిబద్ధత కలిగిన భాగస్వామి పాత్రను పోషిస్తోందని చాటిచెబుతోంది.

అందరికీ ఆరోగ్య సేవలను కల్పించాలనే లక్ష్యంతో పాటు, స్థిరాభివృద్ధి లక్ష్యాలను కూడా సాధించడానికి సాంప్రదాయక వైద్య సంపూర్ణ సామర్థ్యాన్ని వినియోగించుకోవడంలో డబ్ల్యూహెచ్ఓకు, ఆ సంస్థ సభ్య దేశాలకు మద్దతును అందించేందుకు భారత్ ఎప్పటి మాదిరిగానే కట్టుబడి ఉంటుంది.

# ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్రకు యోగాంధ్ర : కె.విజయానంద్



అమరావతి, మే 29:ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా మే 21న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమం ముందుకెళ్తోందని, ఇదే స్ఫూర్తితో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా అడుగులేద్దామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. ఆయుష్‌శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పోలీస్ కమిషనరేట్, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీసు థీమ్ యోగా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొని సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు.

అనంతరం సీఎస్ మాట్లాడుతూ? ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయని, అప్పటికి కనీసం రెండుకోట్ల మందికి యోగాను నేర్పించేలా ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,25,000 మంది యోగా ట్రైనర్లు నమోదు చేసుకున్నారని, వీరి సహాయంతో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు యోగాసనాలు నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, విభిన్న ప్రతిభావంతులు.. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేసేందుకే ఈ థీమ్ యోగాను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ప్రతిజిల్లాలో నాలుగైదు చొప్పున పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. థీమ్ యోగాంధ్రలో భాగంగా గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం విజయవంతమైందని.. ఇదే స్ఫూర్తితో యోగాంధ్ర విజయవంతానికి కృషిచేద్దామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు.

యోగాంధ్రకు విశేష స్పందన..

యోగాంధ్రకు విశేష స్పందన లభిస్తోందని.. అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములవుతూ యోగా ఔన్నత్యానికి వన్నె తెస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు అన్నారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ యోగాభిలాషులు నమోదు చేసుకుంటున్నారని, కొన్ని జిల్లాల్లో లక్ష్యానికి మించి ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వివరించారు.

కనులవిందుగా కళాత్మక యోగా..

కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్వాసపై ఏకాగ్రత అనేది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందంటూ యోగా, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఓం శాంతి బ్రహ్మకుమారీలు యోగా ఔత్సాహికులతో ధ్యాన సాధన చేయించారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ జి.వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.రాజకుమారి, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఏపీఎస్పీ ఐజీ రత్నకుమారి, డీసీపీ కేజీవీ సరిత, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహి, మెడికల్ ఆఫీసర్ డా. వై.రత్న ప్రియదర్శిని, అమరావతి యోగా, పతంజలి యోగా, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఓం శాంతి బ్రహ్మకుమారీలు, పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.

# స్టీల్ హింజ్స్ ఫ్యాక్టరీపై బీఐఎస్ దాడులు



న్యూఢిల్లీ, మే 29:నకిలీ ఐఎస్ఐ ముద్రలతో ఉత్పత్తులు తయారు చేస్తున్న ఓ పరిశ్రమపై భారతీయ ప్రమాణాల బ్యూరో (ఃఎా), హైదరాబాద్ శాఖా కార్యాలయ అధికారులు దాడులు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఓ పరిశ్రమలో నకిలీ ఐఎస్ఐ ముద్రలతో ఇంటి తలుపులకు వాడే స్టీల్ హింజ్లును తయారుచేస్తూ, మార్కెట్కు సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఉత్పత్తులతో పాటు నకిలీ ఐఎస్ఐ ముద్రించిన ప్యాకేజింగ్ లేబుల్ అట్టలనూ సీజ్ చేసినట్లు బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ తెలిపారు.

ఎా 1341:2018 ప్రమాణానికి లోబడి స్టీల్ బట్ హింజ్లను తయారు చేయాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వం ఈ ఉత్పత్తికి క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ గెజిట్ ద్వారా బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. దీన్ని తయారు చేసేందుకు కచ్చితంగా బీఐఎస్ నుంచి ధ్రువీకరణ పొందడంతో పాటు మార్కెట్లో నిల్వ చేయాలన్నా, విక్రయించాలన్నా దానిపై ఐఎస్ఐ ముద్రతో పాటు తయారీదారు లైసెన్సు వివరాలు ముద్రించాల్సి ఉంటుంది. కానీ, ఈ ఫ్యాక్టరీలో ఎలాంటి ధ్రువీకరణ లేకుండానే ఐఎస్ఐ మార్కును అనధికారికంగా వినియోగిస్తున్నట్లు బీఐఎస్ అధికారులు గుర్తించారు. బీఐఎస్ డైరెక్టర్ తమ్మాడి సుజాత, జాయింట్ డైరెక్టర్ తన్నీరు రాకేశ్ నేతృత్వంలోని బృందం దాడుల్లో పాల్గొంది.

బీఐఎస్ చట్టం 2016 ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపడుతున్నామని పీవీ శ్రీకాంత్ తెలిపారు. తప్పనిసరి జాబితాలో ఉన్న ఏ ఉత్పత్తిని అయినా బీఐఎస్ ధ్రువీకరణ లేకుండా తయారుచేసినా, నిల్వ చేసినా, విక్రయించినా చర్యలుంటాయన్నారు. దీనికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల దాకా జరిమానాతో పాటు ఏడాది నుంచి 5ఏళ్ల దాకా జైలు శిక్షా పడే అవకాశముందన్నారు.

వినియోగదారులు కొనే ప్రతీ వస్తువునూ బీఐఎస్ కేర్ యాప్లో నాణ్యత పరీక్షించుకొని కొనాలని.. నకిలీ నాణ్యతా చిహ్నాల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ప్రతీ ఐఎస్ఐ మార్కు పైన ఆ వస్తువు యొక్క ఐఎస్(ఇండియన్ స్టాండర్డ్) నెంబరు, కింద ఆ తయారీదారు లైసెన్సు నెంబరు కచ్చితంగా ఉండాలన్నారు. ఆ లైసెన్సు నెంబరును బీఐఎస్ కేర్ యాప్లో నమోదు చేసి వస్తువు యొక్క పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. బంగారు ఆభరణాలకైతే హెచ్యూఐడీ తప్పనిసరి ఉండాలని.. దాని ద్వారా ఆ ఆభరణం శుద్ధతనూ ఇదే యాప్లో తెలుసుకోవచ్చన్నారు. ఇదే ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షించేందుకూ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ బీఐఎస్ కేర్ యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఉల్లంఘనలు మీ దృష్టికి వచ్చినా బీఐఎస్ కేర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. ఇతర వివరాలకు హైదరాబాద్ శాఖా కార్యాలయాన్ని +91 9154843230/31 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## ఆంధ్రా లయోలా కళాశాలకు మళ్లీ అటానమస్ హోదా..

ఎంతో చరిత్ర ఉన్న విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలకు అటానమస్ హోదా తిరిగి పునరుద్ధరణ అయింది. గతంలో ఉన్న అటానమస్ హోదా 2022-23 సంవత్సరంతో ముగిసినప్పటికీ, తదుపరి రెన్యువల్ కోసం కళాశాల యాజమాన్యం యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ ను సంప్రదించలేదు. అయినప్పటికీ ఆంధ్రా లయోల కళాశాల మాత్రం లేని అటానమ హోదాతోనే కొనసాగుతూ వస్తుంది. ఇటీవల దీనిపై పెద్ద ఎత్తున ఆరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో కృష్ణ యూనివర్సిటీ స్పందించి, కళాశాలకు నోటీసులు సైతం జారీ చేసింది. దీంతో కళాశాల యాజమాన్యం తిరిగి అటానమస్ హోదా కోసం యూజీసీకి అన్ని అనుమతులు కోరుతూ పూర్తి సమాచారంతో దరఖాస్తు చేసుకున్నాయి.

ఈ నేపథ్యంలో ఇటీవలే సమావేశమైన యూజీసీ కమిటీ సభ్యులు కళాశాల దరఖాస్తులు, విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలు, వాస్తవ పరిస్థితులపై క్షుణ్ణంగా విచారణ చేసి తిరిగి కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. 3031- 32 విద్యా సంవత్సరం వరకు సుమారు పది సంవత్సరాల పాటు ఈ అటానమస్ హోదా కళాశాలకు లభిస్తోంది. దీనికి సంబంధించి యూజీసీ పూర్తి ఆదేశాలను క్రిష్ణ యూనివర్సిటీకి జారీ చేసింది. ప్రస్తుతం 10 సంవత్సరాల కాల పరిమితికి జారీ చేస్తున్న ఈ ఆదేశాలు ముగిసే మూడు నెలల ముందుగానే రెన్యూవల్ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని కృష్ణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కు జారీ చేసిన ఆదేశాలలో యూజీసీ స్పష్టం చేసింది. ప్రస్తుతం కళాశాలకు తిరిగి అటానమస్ హోదా లభించడం పట్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దేశంలోకి 'ఎఫ్‌డిఐ' రాకలో 14 శాతం పెరుగుదల... ఇందులో 19 శాతం వాటాతో సేవల రంగం ముందంజ

బకేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారు హిత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం- అన్ని రంగాల్లోనూ స్వయంచలిత మార్గం ద్వారా 100 శాతం 'ఎఫ్‌డిఐ'కి అవకాశం ఏర్పడింది. మరోవైపు భారత్‌ను ఆకర్షణీయ, పోటీతత్వ పెట్టుబడి గమ్యంగా సదా నిలబెట్టడం కోసం ఈ విధానాన్ని ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తూంటుంది. అందువల్ల దేశంలోకి 'ఎఫ్‌డిఐ' రాక స్థిరంగా పెరుగుతూ వచ్చింది. తదనుగుణంగా 2013?14లో 36.05 బిలియన్ డాలర్ల నుంచి 2023?24లో 71.28 బిలియన్ డాలర్లుకు చేరి, అటుపైన 14 శాతం వృద్ధితో 2024?25కల్లా 81.04 బిలియన్ డాలర్ల స్థాయికి (తాత్కాలిక అంచనా) పెరిగింది.

'ఎఫ్‌డిఐ'కి సంబంధించి 2024?25లో సేవల రంగం వాటా అత్యధికంగా ఉంది. ఈ మేరకు వచ్చిన మొత్తం పెట్టుబడులలో 19 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, కంప్యూటర్ సాఫ్ట్ వేర్- హార్డ్ వేర్ రంగం, (16శాతం) ట్రేడింగ్ రంగం (8 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మొత్తంమీద సేవల రంగంలోకి 'ఎఫ్‌డిఐ' గత సంవత్సరం 6.64 బిలియన్ డాలర్లు కాగా, 40.77 శాతం పెరుగుదలతో 9.35 బిలియన్ డాలర్లకు చేరింది.

భారత తయారీ రంగం కూడా నేడు 'ఎఫ్‌డిఐ'కి కూడలిగా మారుతుండగా 2024?25లో పెట్టుబడులు 18 శాతం పెరిగాయి. కాగా, 2023-24లో 16.12 బిలియన్ డాలర్లతో పోలిస్తే 19.04 బిలియన్‌డాలర్లకు చేరింది. ఇక రాష్ట్రాలవారీగా- 2024-25లో మొత్తం 'ఎఫ్‌డిఐ'లో మహారాష్ట్ర 39 శాతంతో అత్యధిక వాటా పొందగా, కర్ణాటక (13 శాతం), ఢిల్లీ (12 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ పెట్టుబడులు సమకూర్చిన దేశాలలో సింగపూర్ 30 శాతంతో ముందంజలో ఉండగా, మారిషస్ (17 శాతం), అమెరికా (11 శాతం) తదుపరి స్థానాల్లో నిలిచాయి.

గడచిన 11 సంవత్సరాల్లో (2014?25) భారత్ 748.78 బిలియన్ డాలర్ల 'ఎఫ్‌డిఐ'లను ఆకర్షించింది. ఇది మునుపటి 11 ఏళ్లతో (2003?14) పోలిస్తే, 143 శాతం పెరుగుదల నమోదైంది. మొత్తంమీద 308.38 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. గత 25 సంవత్సరాల్లో వచ్చిన మొత్తం 1,072.36 బిలియన్‌డాలర్లలో ఇది దాదాపు 70 శాతం కావడం గమనార్హం.

# మానవత్వం చాటుకున్న జగన్..





అమరావతి, మే 29: మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మరోసారి తన మానత్వాన్ని చాటుకున్నాడు. బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన మహిళ రహదారిపై ఉండడం చూసి చలించిపోయారు.

విజయవాడలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు వస్తున్న సందర్భంలో వారిధిపై ప్రమాదం జరగడం, వృద్ధురాలు తీవ్ర గాయాలతో ఉండటాన్ని చూసి వెంటనే 108కు స్వయంగా జగనే ఫోన్ చేసినప్పటికీ, ఎటువంటి స్పందన లభించకపోవడంతో తక్షణమే ఆమెను వైద్య చికిత్సలు అందించి, ఆసుపత్రిలో చేర్పించే బాధ్యతను ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ కు అప్పగించారు.

అటుగా వెళుతున్న ప్రైవేటు అంబులెన్స్ పై ఆ వృద్ధురాలిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఎమ్మెల్సీ స్వయంగా తీసుకువెళ్లారు. ఆమెకు ప్రథమ చికిత్సతో పాటు, అన్ని చికిత్సలు అందే వరకు అక్కడే ఉన్న అరుణ్ కుమార్, ఆమె ఆరోగ్య వివరాలను ఫోన్ ద్వారా జగన్ కు సమాచారం అందించారు. అలాగే వృద్ధురాలికి ఆర్థిక సహాయాన్ని కూడా మొండితోక అరుణ్ కుమార్ అందజేశారు.

# ఈ విద్యా సంవత్సరం నుండే నవోదయ తరగతులు




నిజామాబాద్, మే 29: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నిజామాబాద్, జగిత్యాల జిల్లాలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కాగా ఇటీవల నిజామాబాద్ ఎంపీ అర్వింద్, నేటి పరిస్థితుల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని నవోదయ అధికారులు ఆదేశించారు. ఇందులో భాగంగా విద్యాలయాల శాశ్వత, తాత్కాలిక స్థలాలకు సంబంధించి అవసరమైన చర్యలు ప్రారంభించాలని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ లేఖ రాశారు.

నిజామాబాద్ జిల్లాలో శాశ్వత భవన నిర్మాణానికి జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 1063 లో, తాత్కాలిక వసతి కోసం నాగారం శివారులోని ప్రభుత్వ డైట్ కళాశాల ఎంపిక చేయబడ్డాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని ఎలాంటి వివాదాలు లేని కలిగోట శివారులోని 30ఎకరాల భూమి నవోదయ విద్యాలయ సమితి పేరుపై బదలాయింపు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా శాశ్వత, తాత్కాలిక భవనాల్లో రోడ్లు, నీరు, విద్యుత్, టెలికమ్యూనికేషన్ లాంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని లేఖలో ఆయన పేర్కొన్నారు.

ఈ విద్యా సంవత్సరం నుండి విద్యా సంస్థ తాత్కాలిక భవనంలో ప్రారంభమయ్యేందుకు అవసరమైన మరమ్మతుల పనుల స్థితిపై నివేదిక అందజేయాలని జవహర్ నవోదయ విద్యాలయ నిజాంసాగర్ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. కాగా నవోదయ విద్యాసంస్థ మంజూరు చేయడంతో పాటు ఈ సంవత్సరం నుండే తరగతులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవడంతో పాటు , తాత్కాలిక భవన మరమ్మత్తుల కోసం తన ఎంపీ నిధుల ద్వారా రూ.20లక్షలు మంజూరు చేసినందుకు జిల్లా ప్రజలు ఎంపీ అర్వింద్ కు ధన్యవాదాలు తెలిపారు.

# సీసీఎస్ (పెన్షన్) రూల్స్ 2021లోని రూల్ 37కు సవరణ

న్యూఢిల్లీ, మే 29:ఆర్థిక మంత్రిత్వ శాఖ లోని వ్యయ విభాగం, సిబ్బంది - శిక్షణ విభాగం, చట్ట వ్యవహారాల విభాగం, శాసన విభాగం, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌తో సంప్రదింపుల తర్వాత, పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ సీసీఎస్ (పెన్షన్) నిబంధనలు, 2021 లోని నిబంధన 37 (29) (సి)కి సవరణ తీసుకువచ్చింది.

"... ఒక ఉద్యోగి ప్రభుత్వ రంగ సంస్థలో చేరిన తరువాత ఏదైనా దుష్ప్రవర్తన కారణంగా అతనిని సంస్థ నుంచి తొలగించడం లేదా ఉద్యోగం నుంచి తొలగించడం జరిగితే ప్రభుత్వ సేవకు సంబంధించిన పదవీ విరమణ ప్రయోజనాలను కూడా కోల్పోతాడు. ఉద్యోగం నుంచి అతని తొలగింపు, (డిస్మిస్ / రిమూవల్/ రిట్రెంచ్మెంట్) సందర్భంలో ఆ సంస్థ తీసుకున్న నిర్ణయం సంస్థతో పరిపాలనాపరంగా సంబంధం ఉన్న సంబంధిత మంత్రిత్వ శాఖ సమీక్షకు లోబడి ఉంటుంది.

రూల్ 7, 8లోని సంబంధిత నిబంధనలు రూల్ 41, రూల్ 44(5)(ఎ)అండ్ (బి) నిబంధనల కింద ప్రభుత్వోద్యోగికి వర్తిస్తాయి.

సూరజ్ ప్రతాప్ సింగ్ వర్సెస్ సీఎండీ బీఎస్ఎన్ఎల్ అండ్ ఓఆర్ఎస్ పేరుతో ఎస్ఎల్పి నెం.4817/2020లో సుప్రీంకోర్టు 09.01.2023న జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో సీసీఎస్ (పెన్షన్) రూల్స్, 2021లోని రూల్ 37 (29)(సి)లో సవరణ చేశారు.

# చిరునామా కనుగొనడంలో ఇబ్బందులకు ఇక చెక్!

**-ఆధార్ తరహాలో యూనిక్ నంబర్ కేటాయింపు**

**-'డిజిటల్ అడ్రస్ సిస్టమ్' తేనున్న కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ, మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: మహానగరాల్లో కొత్తవారు ఏదైనా ఒక అడ్రస్ కనుగొనడమంటే కత్తి మీద సాము చేయడం వంటిదే. గూగుల్ మ్యాప్ సైతం కచ్చితత్వంతో మనం కోరుకున్న చిరునామాకు మనలను తీసుకెళ్లలేకపోతున్నది. కొన్నిసార్లు మనం వెళ్లదలచుకున్న ప్రదేశాన్ని సమీపంలోని బండగుర్తు (ల్యాండ్‌మార్క్) ఆధారంగా కనుగొనాల్సి వస్తుంది. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి ఇంటికి (చిరునామాకు) ఆధార్ తరహాలో ఓ ప్రత్యేకమైన డిజిటల్ గుర్తింపు నంబర్ ఇవ్వనున్నట్టు తెలిసింది. దీంతో ప్రతి భారతీయుడి నివాసానికి అధికారికమైన ఓ ప్రత్యేక గుర్తింపు నంబర్ (డిజిపిన్ నంబర్) లభించనుంది. తాను నివసిస్తున్న ప్రదేశానికి భవిష్యత్తులో ఇదే ఐడీ ప్రూఫ్‌గా మారనుంది. నివాసాలను, ప్రదేశాలను కచ్చితంగా, వేగంగా కనుగొనే లక్ష్యంగా ఈ ప్రత్యేక డిజిటల్ ఐడీ నంబర్ పంపిణీకి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు ఓ ఆంగ్ల పత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతమున్న భౌతిక చిరునామాలను డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) వ్యవస్థలో అనుసంధానం చేయడానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నది. ప్రస్తుతం దేశంలో అడ్రస్‌ల డాటాను నిర్వహించేందుకు ఓ ప్రామాణికమైన వ్యవస్థ అందుబాటులో లేదు. దీంతో ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని చాలామంది తప్పుడు అడ్రస్‌లతో మోసాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఈ చిరునామాల డాటాకు సంబంధించి దేశంలో స్పష్టమైన నియమ నిబంధనలు అమలులో లేకపోవడంతో పలు ప్రైవేటు కంపెనీలు పౌరుల వద్ద వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, వారి అనుమతి లేకుండానే ఇతరులతో పంచుకుంటున్నాయి. ప్రభుత్వం అమలుచేయనున్న కొత్త డిజిటల్ ఐడీలతో ఈ అక్రమాలన్నింటికీ అడ్డుకట్టవేయవచ్చని ఆ పత్రిక కథనం వివరించింది. డిజిటల్ ఐడీలతో పౌరుల వ్యక్తిగత వివరాలు వారి నియంత్రణలో ఉండిపోతాయి. ఎవరైనా ఆ వివరాలను పొందాలంటే ఇకపై సదరు వ్యక్తి అనుమతి ద్వారానే సాధ్యం కానుంది.

# ఉద్యమకారులకి ఇచ్చిన హామీల అమలును జూన్ 2వ తేదీలోపు ప్రారంభించాలి

**-తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుల్లు డాక్టర్ చిమ శ్రీనివాస్**

హైదరాబాద్ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గత 2023 అసెంబ్లీ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిపెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని, 6 గ్యారెంటీ హామీలలో హామీ ఇవ్వడం జరిగింది.

ఆ ఎన్నికలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, ఉద్యమకా రులు, కాంగ్రెస్ పార్టీ విజయంలో ముఖ్య భూమికను పోషించడం జరిగింది. మీరు ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేరుస్తూ ప్రజా ప్రభుత్వంగా పనిచేస్తున్నం దులకు ధన్యవాదములు. అదే విధంగా తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయా లని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుల్లు డాక్టర్ చిమ శ్రీనివాస్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాస్దినట్లు డాక్టర్ చిమ శ్రీనివాస్ తిలిపారు.

వవ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేర్సిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ కమిటీని ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, గుర్తింపు కార్డులు జారీ చేయాలి.

సంక్షేమ పథకాలలో, ఇందిరమ్మ ఇండ్లలో రాజీవ్ యువ వికాసంలలో 20% కోటా ఉద్యమకారులకు కేటాయిం చాలి. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 10 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలి తెలంగాణ సాంస్కృతిక విభాగంలో వెయ్యి ఉద్యోగాలు కల్పించి తెలంగాణ ఉద్యమ కళాకారులకి కేటాయిం చాలి.

తెలంగాణ ఉద్యమ నమస్కారాలతో... ఇటి కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యులు దయానంద్, కొండ స్వామి, గగన్ కుమార్, వీరాస్వామి, కొంతం యాది రెడ్డి, జగన్ యాదవ్, సుదర్శన్ రావు, ఆర్కే భూపాల్, సుదర్శన్, శివ కుమార్ నేత, విష్ణువర్ధన్, శ్యామల, ప్రభు గుప్తా, రామ్ బాబు, నరేందర్ గౌడ్, చంద్ర శేఖర్, లక్ష్మణ్, గౌస్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు

# కెసిఆర్ ఒక్కడే నాయకుడు - కవిత




హైదరాబాద్, మే 29: మా నాన్నకు తాను లేఖ రాస్తే తప్పేంటి? అయినా మీకు నొప్పి ఏందిరాబయ్? అంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత సూటిగా ప్రశ్నించారు. ఇంటి ఆడబిడ్డపై ఎటు పడితే అటు మాట్లాడితే సరి కాదని వె హితవు పలికారు. హైదరాబాద్ లో నేడు ఆమె మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు నీతులు చెబుతోన్న బీఆర్ఎస్ పార్టీ నేతలు.. తెలంగాణ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలంటూ సూచించారు. కేసీఆర్ నీడలో పని చేస్తోన్న వారు.. తనపై ప్రతాపం చూపిస్తున్నారంటూ మండిపడ్డారు. ఇదే సందర్భంగా తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్‌పై పూర్తి విధేయతను ప్రకటించారు.

**నా ఫీడ్‌బ్యాక్‌ను లీక్ చేశారు**

పార్టీలోని కొందరు నేతల ప్రవర్తనపై కవిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే కూడా నాయకులెవరూ స్పందించకపోతే ఎలా" అని ఆమె ప్రశ్నించారు. పార్టీలో కొందరు కోవర్టులు ఉన్నారని, వారు తనకు నీతులు చెబుతున్నారని ఆరోపించారు. "నా మీద పడి ఏడిస్తే ఎలా" అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు. తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారని, దాన్ని అరికట్టమని కోరితే, పెయిడ్ సోషల్ మీడియా ద్వారా తనపైనే విమర్శలు చేయిస్తున్నారని కవిత మండిపడ్డారు. "ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా" అని ఆమె నిలదీశారు.

**ఉద్యమాలు చేయకుండా ట్విట్టర్ లో ట్వీట్ చేస్తే ఎలా..**

దమ్ముంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీపై మీ ప్రతాపం చూపించాలంటూ ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆమె సవాల్ విసిరారు. తాను అసలే మంచి దాన్ని కాదని.. తాను నోరు విప్పితే తట్టుకోలేరంటూ బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయకుండా.. ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? అంటూ సోదరుడు కేటీఆర్‌ను ఆమె సూటిగా ప్రశ్నించారు. తనను రేవంత్ రెడ్డి కోవర్ట్ అనటం కరెక్టేనా అని ప్రశ్నించారు. పెయిడ్ ఆర్టిస్ట్‌లతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కేసీఆర్‌కి అప్పుడే చెప్పా..**

బీజేపీకి బీఆర్ఎస్‌ను అప్పగించే ప్రయత్నం జరుగుతుందని ఆమె అభిప్రాయమన్నారు. తనను కాంగ్రెస్ కోవర్ట్ అన్నారు. మరి బీఆర్ఎస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారనుకోవాలా అని సందేహం వ్యక్తం చేశారు. తాను జైలులో ఉన్నప్పుడే.. బీజేపీలో బీఆర్ఎస్‌ను కలపొద్దని కేసీఆర్‌ను కోరానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. తొందరపాటు నిర్ణయం వద్దని జైల్లో ఉన్నప్పుడు కేసీఆర్‌కు సూచించానన్నారు. ఆరు నెలలు కాదు.. సంవత్సరాలు అయినా జైల్లో ఉంటానని కేసీఆర్‌కు తాను స్పష్టం చేశానని కవిత ఈ సందర్భంగా వివరించారు.

**నాపై పడి ఏడుస్తున్నారు..**

బీజేపీ నేతలకు చెందిన హాస్పిటల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్ళింది ఎవరో అందరకీ తెలుసునంటూ పార్టీలోని అగ్రనేతలను ఆమె పరోక్షంగా విమర్శించారు. తన లేఖ లీక్ చేసిందెవరు తేల్చమంటే.. తనపై పడి ఏడుస్తున్నారంటూ మండిపడ్డారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించారన్నారు. కేసీఆర్ లెక్క.. తాను చాలా తిక్కదానినని ఆమె పునరుద్ఘాటించారు. వెన్నుపోటు రాజకీయాలు తను రావని.. సూటిగా మాట్లాడుతానని కుండ బద్దలు కొట్టారు.

**మహాభారతం క్యారెక్టర్లు..**

సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానన్నారు. మా వాళ్ళు కొందరు.. సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. వారు స్థాయికి మించి ఊహించు కుంటున్నారంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ సభ తమ వలనే సక్సెస్ అయిందని కొందరు ఊహించుకుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్ద వాళ్ళు అయిపోయామని వారంతా భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యేలే ఓడించారు..**

జైలు వెళ్ళేటప్పుడు పార్టీకి, పదవికి రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ వద్దంటేనే తాను ఈ పదవిలో కొనసాగుతున్నానన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిజామాబాద్ ఎంపీగా తనను ఓడించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా ఉండగా చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారన్నారు.

**సీఎం చంద్రబాబు ఏమి చేసినా..**

ఏపీ సీఎం చంద్రబాబు ఏమి చేసినా.. కేంద్రం అడ్డుకోవటం లేదని ఒకింత అసహనాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇప్పటికీ గోదావరి నదీ జలాలు పంపకం సరిగా జరగలేదన్నారు. ఏపీ చేపట్టనున్న బనకచర్ల ప్రాజక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే..**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ నోటీసులు ఇస్తే.. పార్టీ ఎందుకు కార్యాచరణ తీసుకులేదని పార్టీలోని అగ్రనేతలను ఆమె సూటిగా ప్రశ్నించారు. పెద్ద నేతలుగా ఊహించుకునే వారు ఎందుకు స్పందించ లేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో తాను చేరటానికి ప్రయత్నం చేశాననటం అబద్ధమన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని ఈ సందర్భంగా కవిత అభివర్ణించారు. తన పార్టీ బీఆర్ఎస్.. తన నాయకుడు కేసీఆర్ అంటూ కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే తన నాయకుడని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ తప్ప.. ఇతర నేతల నాయకత్వంలో తాను పనిచేయనని కుండ బద్దలు కొట్టారు.

# సామాజిక ఉద్యమంలా వన మహోత్సవాన్ని నిర్వహిద్దాం

**--పచ్చని తోరణంలా తెలంగాణ వికసించాలి**

**-వేముల మహేందర్ గౌడ్ పిలుపు**

జయశంకర్ భూపాలపల్లి మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జూన్ మొదటి వారం నుంచి పెద్ద ఎత్తున మొక్కలు నాటి అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పకడ్బందీ కార్యాచరణ రూపొందించారని, అందులో భాగంగానే గ్రామ గ్రామాన మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై..సామాజిక ఉద్యమంలా వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసి..పచ్చని తోరణంలా తెలంగాణ వికసించేలా కృషి చేద్దామని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొక్కలే మనిషికి జీవనాధారమని, అలాంటి మొక్కలను నాటి..రేపటి తరానికి భవిష్యత్తును అందించే క్రమంలో మంత్రి కొండా సురేఖ ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. నేడు కాలుష్యం అధికమై ఓజోన్ పొర రంధ్రం పడడంతో తెలంగాణలో విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు ఒక యజ్ఞంలా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించి..కాలుష్య నివారణకు కృషి చేసేందుకు ముందుకు రావాలన్నారు.

# డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది జూన్ మధ్య బంగ్లాదేశ్‌లో ఎప్పుడైనా ఎన్నికలు

న్యూ డిల్లీ మే 29 (ఎక్స ప్రెస్ న్యూస్ );పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ముహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై స్థానికంగా ఒత్తిడి పెంచింది. డిసెంబర్ కల్లా దేశంలో ఎన్నికలు నిర్వహించాలని పలు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వేలాది మంది యువజనులు, బీఎన్‌పీ కార్యకర్తలు దేశ వ్యాప్తంగా నిరసన చేపడుతున్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ స్పందించారు.ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది (2026) జూన్ మధ్య ఎప్పుడైనా ఎన్నికలు జరగొచ్చని చెప్పారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న యూనస్.. టోక్యోలో నిర్వహించిన ఓ పబ్లిక్ ర్యాలీలో ఈ మేరకు ప్రకటన చేశారు. కొన్ని సంస్కరణలు చేపడుతున్నట్లు చెప్పారు. సంస్కరణల అమలు తీరును బట్టి ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది జూన్ మధ్యలో ఎన్నికలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.గతేడాది బంగ్లాలో రాజకీయ అస్థిరత నెలకొన్న విషయం తెలిసిందే. ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారింది. వేలాది మంది నిరసనకారులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రజా ఉద్యమానికి జడసి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం వీడారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్మీ దేశాన్ని తమ చేతుల్లోకి తీసుకుంది.

ఆ తర్వాత బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్‌గా నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. గతేడాది ఆగస్టు 8న ఆయన తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.ఇప్పుడు ఆ దేశంలో మళ్లీ రాజకీయ సంక్షోభం రాజుకుంటున్నది. తన పదవికి రాజీనామా చేస్తానని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ హెచ్చరించినట్లు వార్తలు వెలువడ్డాయి.

ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతోనే యూనస్ రాజీనామా బెదిరింపులు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణం, నిరసనల మధ్య తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్న కారణంగానే రాజీనామా చేయాలని యూనస్ యోచిస్తున్నట్లు విద్యార్థులుస

ఏర్పాటు చేసుకున్న నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్‌సీపీ) కన్వీనర్, విద్యార్థి ఉద్యమ నాయకులలో ఒకరైన నహీద్ ఇస్లామ్ బీబీసీకి తెలిపారు.డిసెంబర్ కల్లా దేశంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది యువజనులు, బీఎన్‌పీ కార్యకర్తలు బుధవారం ఢాకాలో ప్రదర్శన నిర్వహించారు. డిసెంబర్ కల్లా జాతీయ ఎన్నికలు జరగాలని, వెంటనే ఇందుకు సన్నాహాలు ప్రారంభించాలని బీఎన్‌పీ తాత్కాలిక ఛైర్మన్ తారీఖ్ రెహ్మాన్ డిమాండు చేశారు. లండన్ నుంచి వర్చువల్‌గా ఆయన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు.

యూనస్ ఆశీస్సులతో కొత్తగా విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పడిన నేషనల్ సిటిజెన్ పార్టీకి వ్యతిరేకంగా తమ బలాన్ని ప్రదర్శిస్తూ వేలాది మంది విద్యార్థులు నేటి ర్యాలీలో పాల్గొన్నారు.

# మనువాద సంస్కరణలు మా పేద విద్యార్థులకేనా?

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్**

హైదరాబాద్ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎస్సీ గురుకుల విద్యార్థుల పట్ల చూపిస్తున్న వివక్షపై ఆయన మండిపడ్డారు. విద్యార్థులే టాయిలెట్లు శుభ్రం చేసుకోవాలి.. వాళ్ల వంటలు వాళ్లే చేసుకోవాలన్న అలుగు వర్షిణి వ్యాఖ్యలను కూడా ఆర్ఎస్పీ తీవ్రంగా ఖండించారు.రేవంత్ రెడ్డి గారు.. మీరే మంత్రిగా ఉన్న సాంఘీక సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఒక ఐఏఎస్ అధికారి డా. అలుగు వర్షిణి.. దళిత విద్యార్థులు సంపన్న వర్గాల నుండి రాలేదు కావున హాస్టల్స్‌లో వారి టాయిలెట్స్ వాళ్లే శుభ్రం చేసుకోవాలి, వాళ్ల వంటలు వాళ్ళే చేసుకోవాలి, ఇందులో తప్పేముంది అని బహిరంగంగా హుకుం ఇచ్చారు. దీన్ని ప్రశ్నించిన తల్లిదండ్రులను బయటకు గెంటేయండి అని చెబుతున్నారు. ఈ లాంటి 'మంచి' అలవాట్లు విద్యార్థులకు భవిష్యత్‌లో చాలా బాగా పనికొస్తాయని వారు గట్టిగా సమర్థించుకుంటున్నారు కూడా. పైగా దీన్ని రాజకీయం కూడా చేయొద్దు అని వారు హెచ్చరిస్తున్నారు.మీ ఆదేశాలు లేకుండా ఏ అధికారి కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకోరు. తరతరాలుగా మా టాయిలెట్లు మేం కడుక్కుంటూనే ఈ నిచ్చెనమెట్ల సమాజం టాయిలెట్లు కూడా మేమే కడుగుతున్నాం. అయినా ఇన్ని గొప్ప మనువాద సంస్కరణలు మా పేద విద్యార్థులకేనా? మీ పిల్లలు చదివే కార్పొరేట్ స్కూల్స్‌లో కూడా అమలు చేయాలని మీ అధికారులకు చెప్పండి. అలాగే ముఖ్యమంత్రిగా, సంక్షేమ మంత్రిగా, సంపన్న వర్గాల ప్రతినిధిగా మీరు కూడా మీ టాయిలెట్ ఈ రోజు నుండే కడుక్కోండి, మీ మంత్రులతో, అధికారులతో కడిగించండి, గాంధీ భవన్‌లో మీ సహచరులతో కడిగించండి. ప్రతి రోజూ ఆ ఫోటోలను వీడియోలను తెలంగాణ ప్రజలతో షేర్ చేసుకోండి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.రేవంత్ రెడ్డి గారి బంగళాకు ఈ రోజు నుండి పోవడం మానేయాలని హౌస్ కీపింగ్ సోదరులకు మనవి. ప్రతిరోజూ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా తూట్లుపొడుస్తున్నా, నిలదీయకుండా నిస్సిగ్గుగా అందులో బానిసలుగా కొనసాగుతున్న మా ఎస్సీ ఎస్టీ సోదరులు మల్లు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహకు ఈ పోస్టు అంకితం అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. జై భీం.. జై తెలంగాణ.. అని ఆర్ఎస్పీ నినదించారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి

**-హైదరాబాద్‌లో చెత్త కుప్పల సమస్యపై ఇఖఆఅ తీవ్ర ఆవేదన,**

**-తెలంగాణ సర్కారుకు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి.**

**-జూన్ -5 పర్యావరణ దినోత్సవం సందర్భంగా కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య డిమాండ్లు విడుదల.**

హైదరాబాద్, మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:"విశ్వనగరం", "స్వచ్ఛ నగరం"'గా ప్రకటించబడిన హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు చెత్త కుప్పలతో అస్తవ్యస్తంగా మారింది. ఈ పరిస్థితిపై "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్" (ఇఖఆఅ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య ప్రభుత్వం, పౌరులతో కలిసి తక్షణ చర్యలు తీసుకోవాలని పలు కీలక డిమాండ్లు విడుదల చేశారు.

**చెత్త రోడ్లపై వేసే హక్కు ఎవరిచ్చారు..**

అధికారులు 'స్వచ్ఛ హైదరాబాద్' గురించి మాట్లాడుతున్నారు, కానీ నిజానికి ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, దుర్గంధం, రోగాల విజృంభణ తప్ప మరేమీ కనిపించడం లేదు" అని ఆయన విమర్శించారు. ఉఊఓఅ ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ వ్యవస్థను ప్రవేశపెట్టినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు విఫలమవుతోందని, ఇది పర్యావరణ చట్టాల ఉల్లంఘన అని ఆయన స్పష్టం చేశారు . అందుకు పలు డిమాండ్‌లు చేశారు. కఠిన చట్టాలు ఉ పటిష్ట అమలు చేయాలి ... చెత్తను బహిరంగంగా పారవేసే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలి. జరిమానాలు మాత్రమే కాకుండా, పునరావృతంగా ఉల్లంఘించేవారికి కఠిన శిక్షలు విధించాలి. ప్రస్తుతం ఉఊఓఅ ఈ-చలాన్ వ్యవస్థ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు బలహీనంగా ఉంది .

పౌరుల బాధ్యత: అపార్ట్‌మెంట్లలో తప్పనిసరి చెత్త డబ్బాలు

ప్రతి కుటుంబం తమ చెత్తను ఇంట్లోనే నిల్వ చేసుకోవాలి. అన్ని అపార్ట్‌మెంట్ సముదాయాలు తమ ప్రాంగణంలో మూతగల చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలి. ఇది రోడ్లపై చెత్త వేయడాన్ని తగ్గిస్తుంది .

**ప్రభుత్వ చిత్తశుద్ధి ఉ సామాజిక బాధ్యత.**

పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకోవాలి. ఉఊఓఅ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి, సమస్యలను నేరుగా పరిష్కరించాలి . ప్రజల ఆరోగ్యం, పర్యావరణ సంరక్షణ కోసం స్థిరమైన చర్యలు తీసుకోవాలి . పర్యావరణ దినోత్సవం సందర్భంగానైనా హైదరాబాద్‌ను నిజంగా "స్వచ్ఛ నగరం"గా మార్చాలంటే, ప్రభుత్వం, పౌరులు కలిసి పనిచేయాలని రంగయ్య పిలుపునిచ్చారు. "చెత్త సమస్య పరిష్కారం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి సహకారం అవసరం" అని ఆయన పేర్కొన్నారు. కౌన్సిల్ డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గత ప్రభుత్వం నకిలీ మద్యంతో వేల కోట్లు లూటీ చేసింది : మంత్రి నారా లోకేష్

అమరావతి మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : గత ప్రభుత్వం నకిలీ మద్యంతో వేల కోట్లు లూటీ చేశారని ఎపి మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కడపలో మహానాడు కార్యక్రమంలో మాట్లాడుతూ..గతంలో 'జె' బ్రాండ్ మద్యంతో 30 వేల మందిని చంపేశారని విమర్శించారు. అందరం జెండా, ఎజెండా పక్కన పెట్టి పనిచేశామని, ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. రానున్న జూన్ లో డిఎస్సి నిర్వహిస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి టీచర్ల నియామకం అమలవుతుందని తెలియజేశారు. వైనాట్ 175 అన్నవారికి ప్రతిపక్ష హోదా కూడా రాలేదని ఎద్దేవా చేశారు. సిబిఎన్ అంటే.. అభివృద్ధి, సంక్షేమం, మనందరి ధైర్యం, సిబిఎన్ అంటే.. పేదల చిరునవ్వు అని పేర్కొన్నారు. గతంలో ప్రశ్నిస్తే కేసులని పోరాడితే అరెస్టులని మండిపడ్డారు. తన పైన 23 కేసులు పెట్టారని..అయినా తగ్గేదే లేదని లోకేష్ స్పష్టం చేశారు.

# సన్న వడ్లకు బోనస్ ..రైతులకు వరం.

**-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

సంగారెడ్డి మే 29(నేటి నిజం ప్రతినిధి) సన్నా లకు బోనస్ రైతులకు వరం అని , గతం లో సన్నలకూ బోనస్ ఇవ్వలేదని, ప్రస్తుతం గతం కంటే భిన్నంగా ప్రభుత్వం సన్నలకు బోనస్ రూపంలో 1.72 కోట్ల రూపాయలు వెచ్చించి రైతులకు భారీ ఊరట కలిగించిందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు .

జిల్లాలో రబి సీజన్ వడ్ల కొనుగోళ్ల వివరాలు గత మూడు సంవత్సరాలలో జరిగిన సేకరణలు మరియు చెల్లింపుల వివరాలు ఈ విధంగా వివరించారు:

2023-24 గాను ధాన్యం సేకరణ: 1,00,542.720 మెట్రిక్ టన్నులు

చెల్లింపులు: 126 కోట్లు

లబ్ధిదారులు: 14,776 మంది రైతులు

సన్నలకు బోనస్: జీరో

2024-25 ధాన్యం సేకరణ: 1,21,472.080 మెట్రిక్ టన్నులు

చెల్లింపులు: 237 కోట్లు

లబ్ధిదారులు: 19,166 మంది రైతులు

సన్నలకు అదనంగా బోనస్: 1.72 కోట్లు

ఈ సంవత్సరం జిల్లాలో గత సంవత్సరాలతో పోలిస్తే అత్యధికంగా




ధాన్యం సేకరించడమే కాకుండా, రైతులకు అధిక మొత్తంలో చెల్లింపులు జరిగాయని కలెక్టర్ వివరించారు.

ముఖ్యంగా సన్నలకు బోనస్ చెల్లించడం జిల్లా చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుందన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేస్తూ, వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వహణ, తుది చెల్లింపుల వేగవంతత, మెట్రిక్ టన్నుల ప్రామాణిక సేకరణ వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం దృఢంగా వ్యవహరిస్తోందని తెలిపారు.

# రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ పార్థసారధి




రాజన్న సిరిసిల్ల, 29: (నేటి నిజం ప్రతినిధి): వేములవాడ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారిని బుధవారం రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ పార్థసారధి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన రాజరాజేశ్వరస్వామి, పార్వతీ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో వినోద్ రెడ్డి వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వేములవాడ తహశీల్దార్ విజయప్రకాశ్ రావు, ఆలయ ప్రోటోకాల్ ఏఈవో అశోక్ కుమార్, పర్యవేక్షకులు వరినర్సయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నూగూరి నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రేపే ఎన్నికలు పెట్టండి.. మోదీకి దీదీ సవాల్!

కోల్‌కతా మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అలిపుర్‌దువార్‌లో జరిగిన ర్యాలీలో మోదీ చేసిన ఈ వ్యాఖ్యలపై తాజాగా బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. అఖిలపక్ష ఎంపీల బృందం విదేశాల్లో పర్యటిస్తున్న ఈ తరుణంలో మోదీ నుంచి ఇలాంటి కామెంట్స్‌ను తాను అస్సలు ఊహించలేదన్నారు. ఉగ్రవాదంపై పోరులో మనమంతా ఐక్యంగా ఉన్నామని, టెర్రరిజాన్ని సహించబోమని చెప్పేందుకు ఎంపీలు పర్యటిస్తున్నారని.. ఈ సమయంలో మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇదే సమయంలో ప్రధానికి ఆమె ఓ సవాల్ విసిరారు. ఆ చాలెంజ్ ఏంటో ఇప్పుడు చూద్దాం..

గెలుపు మాదే..

బెంగాల్‌లో రేపే అసెంబ్లీ ఎన్నికలు పెట్టాలని మోదీకి సవాల్ విసిరారు మమతా బెనర్జీ. రాష్ట్ర ప్రజలంతా తమ వైపే ఉన్నారని ఆమె పేర్కొన్నారు. తృణమూల్‌కు ఢోకా లేదని.. తక్షణం ఎన్నికలు నిర్వహించినా తమదే విజయమని దీదీ స్పష్టం చేశారు. కాగా, అలిపుర్‌దువార్‌లో జరిగిన సభలో మమతా సర్కారుపై తీవ్రంగా మండిపడ్డారు మోదీ. బెంగాల్ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోందని.. ముర్షిదాబాద్, మాల్దా అల్లర్లే దీనికి ఉదాహరణ అని అన్నారు. గూండాలకు స్వేచ్ఛ ఇచ్చి ప్రజలపై ఉసిగొల్పారని ప్రధాని ఆరోపించారు. ఇలాగేనా ప్రభుత్వం నడిపేది అని దుయ్యబట్టారు. ప్రతి అంశంలో కోర్టులు కలుగజేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. తృణమూల్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదని.. ఈ సర్కారు మాకు వద్దని అంటున్నారని పేర్కొన్నారు మోదీ. ఈ వ్యాఖ్యలపై దీదీ పైవిధంగా స్పందించారు. వెంటనే ఎన్నికలు పెట్టాలని ప్రధానికి సవాల్ విసిరారు.

# భూత్పూర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి సొరంగ మార్గం ద్వారా నీటిని తరలించాలి



హైదరాబాద్, మే 29:భూత్పూర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి సొరంగ మార్గం ద్వారా నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టాలని కాట్రేవ్ పల్లిరైతులు నారాయణపేట అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా చేపట్టే భూసేకరణలో భూముల కోల్పోతున్న రైతులతో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి మక్తల్ మండలంలోని కాట్రేవుపల్లి, ఎర్నాగంపల్లి, మంతన్ గౌడ్, టేకులపల్లి, కాట్వార్ గ్రామాలలో ' పునరావాసం -పునరాశ్రయం' కల్పించేందుకు గురువారం గ్రామ సభలు నిర్వహించారు.

కాట్రేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ గతంలో భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల కాట్రేపల్లి గ్రామానికి చెందిన 300 ఎకరాలకు రైతుల భూములు కోల్పోయ్యామని వివరించారు. ప్రస్తుతం కొడంగల్ ఎత్తిపోతల వల్ల వంద ఎకరాల వరకు భూములు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూత్పూర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి కాట్రేపల్లి గ్రామ శివారు ముందు భాగం వరకు సొరంగ మార్గం ద్వారా నీటిని తరలించే ప్రక్రియ చేపట్టాలని కోరారు.

అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ రైతుల సమ్మతితోనే భూసేకరణ చేపడతామని వివరించారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో జీవనోపాధి కల్పించడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందిసామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, నీటిపారుదల శాఖ అధికారులు సతీష్, నాగ శివ, పంచాయతీ కార్యదర్శులు, రైతులు, తదితరులు ఉన్నారు .

# జూలై 3వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు అమర్‌నాథ్ యాత్ర

**-సుమారు 42 వేల మంది భద్రతా సిబ్బంది తో బందోబస్తు**

న్యూఢిల్లీ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)బి;: అమర్‌నాథ్ యాత్ర కు సమయం ఆసన్నమైంది. జూలై 3వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు ఆ యాత్ర జరగనున్నది. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకున్నది. కేంద్ర సాయుధ పోలీసు దళాలకు(సేఏపీఎఫ్) చెందిన సుమారు 580 కంపెనీల సిబ్బందిని మోహరించనున్నారు. అంటే సుమారు 42 వేల మంది భద్రతా సిబ్బంది అమరనాథ్ రూట్లో విధులను నిర్వర్తించనున్నారు. ఇప్పటికే 424 కంపెనీల బలగాలను కేంద్ర పాలిత ప్రాంతానికి పంపించారు. ఇక మిగితా 80 కంపెనీల దళాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో అక్కడకు పంపారు. వాళ్లను కూడా వివిధ లొకేషన్లకు మార్చుతున్నట్లు చెప్పారు. అమర్‌నాథ్ యాత్రికులకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తున్నట్లు కేంద్ర బలగాలు పేర్కొన్నాయి. తక్షణమే కేంద్ర బలగాలు జమ్మూకశ్మీర్‌లో పొజిషన్ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతను పటిష్టం చేస్తున్నారు. సీఏపీఎఫ్‌కు చెందిన అయిదు కంపెనీల్లో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ ఉన్నాయి. గురువారం జమ్మూ విజిట్ సమయంలో భద్రతాను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమీక్షించనున్నారు. సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ ఇప్పటికే అమర్‌నాథ్ యాత్రపై సమీక్ష నిర్వహించారు. బీఎస్ఎఫ్ డీజీ దల్జిత్ సింగ్ చౌదరీ కూడా త్వరలో సమీక్ష నిర్వహించనున్నారు. అమర్‌నాథ్ యాత్రకు రెండు మార్గాల్లో వెళ్తారు. అనంత్‌నాగ్ జిల్లాలోని పెహల్గామ్ దారి 48 కిలోమీటర్లు ఉంటుంది. ఇక గందేర్‌బల్ జిల్లాలోని బల్తాల్ రూట్‌లో 14 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం : సీఐ దేవేందర్

మహబూబాబాద్ మే 29: విత్తన డీలర్లు నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ పెండ్యాల దీవెందర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దేవేందర్ మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ దుకాణదారులు తప్పనిసరిగా రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులను అందించాలని సూచించారు.

అనంతరం దుకాణాలలోని స్టాకును పరిశీలించారు రైతులకు అమ్మకం చేసిన తర్వాత వెంటనే రసీదులను అందించాలన్నారు. దుకాణాలలో ఎలాంటి అవకతవకలు జరిగిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి, తాసిల్దార్ రాజేశ్వర్ సిబ్బంది, తదితరులు

# ప్రపంచ కవితా చక్రవర్తికి 2025 స్వర్ణ కిరీటం

శేషేంద్ర నిజానికి ఒక నిత్యనూతనమైన వ్యక్తి. అభివ్యక్తి కొత్త, వస్తువు కొత్త, రూపం కొత్త, గొంతు కొత్త, శిల్పం కొత్త, ప్రతీకలు కొత్త, మార్మికత కొత్త... వెరసి అతని కవిత్వమంతా తాజాతనంతో నిండిన ఒక అప్పుడే విచ్చుకుంటున్న గులాబీ పువ్వులోని తొణికిసలాడే జీవపరిమళమంత కొత్త. అందుకనే అతనివి ఎన్ని ప్రయోగాలో, ఎన్ని నూతన ప్రతిపాదనలో, ఎన్ని కొంగ్రొత్త పోకడలో. తెలుగు సాహిత్యాన్ని హోరెత్తించిన అతినూతన భావచిత్రాల తో 'ఆధునిక మహాభారతం' పేర ఒక ఉత్కృష్ట అత్యాధునిక ఇతిహాసాన్ని రచించడం ఒక గొప్ప మలుపు.

శేషేంద్ర ఒక పరమమైన సాహిత్య సత్యాన్ని కూడా తేటతెల్లపరిచాడు. అదేమిటంటే ఏ రచయితైనా తన జీవితకాలంలో వివిధ సందర్భాల్లో తార్కికంగా అనేకానేక రచనలను కొనసాగిస్తూ వచ్చినా స్థూలంగా అతని రచనలన్నింటిని సంపుటీకరించినట్లైతే వాటిలో అంతఃస్రవంతిగా ప్రవహిస్తూ ప్రవచించే జ్ఞానధాతువు ఒక్కటే ఉంటుంది అని. వాని మూల అక్షరయానం అంతా ఒక్కదిశలోనే ఉంటుంది .. ఒకవేళ వానికి శాస్త్రీయ అంతఃస్పృహ గనుక ఉంటే అది ఒకే గమ్యాన్ని ప్రతిఫలిస్తూంటుంది. అలా కాకుండా బహుముఖ క్షణక్షణ చంచలతతో ఊసరవెల్లిలా రంగులు మార్చే సృజనకారుడు చివరికి ఒక నిబద్ధమైన కార్యశాలిగా కాకుండా ఒక సాహిత్య విదూషకునిగా మారుతాడు. అట్లాగే.. కవిత్వ మూల నిర్వచనాన్ని కూడా స్పష్ట పరుస్తూ ఆయనంటాడు 'కవి ప్రథమతః మనిషి. అంతతః కూడా మనిషే. ఈ సత్యం సచేతన అనుభవంలోనే తెలుస్తుంది. ఆ జ్ఞానం కవికి ఒక విలక్షణ దృష్టి కలిగిన నేత్రాన్ని ప్రదానం చేస్తుంది. ఆ దృక్కోణంలో రాయబడే అతని సృజనాత్మక పంక్తులన్నీ కూడా అప్పుడు కవిత్వమై భాసిస్తాయి అని. ఈ గాఢ అవగాహనతో నేను రాసిన నా జీవితకాల కవిత్వమంతా కూడా వెరసి ఒకే కావ్యమై ' నా దేశం – నా ప్రజలు ' గా శిఖరమై ప్రభవించింది అన్నాడు శేషేంద్ర.

అని శేషేంద్ర తన కవిత్వం గురించి ఇలా చెప్పుకున్నాడు **' కవిత్వం ఒక మెస్మరెజం/ కవి కన్ను ఒక ప్రిజం/ నేను సృష్టించిన అలంకారం/ నీ అంధకారానికి ఒక దారిదీపం'** అని.

శేషేంద్రశర్మ యొక్క మొదటి పుస్తకం 1952 లో ముద్రితమై తెలుగునాట ప్రభవించింది. అది పర్షియన్ ఇతిహాసం ' షహనామా ' ఆధారంగా మాథ్యూ అర్నాల్డ్ రాసిక ' సోహ్రాబ్ మరియు రుస్తుం ' అనే గ్రంథానికి అనువాదం. తర్వాత్తర్వాత అద్భుతమైన ఆయన రాసిన అప్పటి తెలుగు సాహిత్య సామ్రాట్టులైన తిరుపతి వేంకటకవులు, వాల్మీకి కవిత, మేఘ సందేశం, అరవింద సావిత్రి, వ్యాసుడెవరు, వచన కవిత– ఒక ప్రపంచ పర్యవేక్షణ, గురుజాడ అప్పారావు, చిలకమర్తి లక్ష్మీనరసింహారావు తదితర సాహిత్య మూర్తుల గురించీ.. ఆధునిక వచన కవితకు మూలాలైన అప్పటి వచన కవితా ఆవిర్భావ ఉదంతాల గురించీ చాలా విలువైన వ్యాసాలతో వెలువడ్డ ' కాలరేఖ ' గ్రంథానికి 1994 లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించగా, 2004 లో ప్రపంచ స్థాయి ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమానానికి 1975లో ప్రచురితమైన విశిష్ట కవితాసంపుటి ' నా దేశం– నా ప్రజలు ' నామినేట్ చేయబడ్డం.. మరొక అపురూప సందర్భం.

సరికొత్త రూపకాలతో, ఉపమానాలతో, ఉత్ప్రేక్షలతో అలంకృతమైన ' నా దేశం – నా ప్రజలు ' కావ్య సంపుటి 1975 లో వెలువడింది.

**ఏ రచయితైనా తన జీవితకాలంలో వివిధ సందర్భాల్లో తార్కికంగా అనేకానేక రచనలను కొనసాగిస్తూ వచ్చినా స్థూలంగా అతని రచనలన్నింటిని సంపుటీకరించినట్లైతే వాటిలో అంతఃస్రవంతిగా ప్రవహిస్తూ ప్రవచించే జ్ఞానధాతువు ఒక్కటే ఉంటుంది**

**'ఈ చెట్లు పూలెందుకు పూస్తాయి. ఈ నికృష్టపు నాగరికత విడిచే బొగ్గుపులుసు వాయువును పీలుస్తూ?/ ఇవి బుల్లెట్లెందుకు పూయవు?'** అని కేక వేస్తా. ఎప్పుడూ ఎరుగని సంతోషపు ఇంద్రజాలంలో శబ్దమై పాటై పక్షుల శరీరాల్లో పర్వతాల శరీరాల్లో ప్రవహిస్తాడు: కాలం చేతి వేళ్లలోనించి కారిపోతాడు మనిషి! '



'విత్తనంలో ఉన్న నేను ఒక రాగం విన్నాను/ బయటికి వచ్చి ఆకాశాన్నీ, సూర్యుణ్ణీ చూద్దామని, చూచి ఆశ్చర్యామృతాన్ని తాగుదామని కోరిక అంకురించింది.

నేను చెట్టునయ్యాను కొమ్మల్లో చెట్టు కలనయ్యాను.

అంటే రాగరసగంధాలు మిళితం చేసుకున్న పువ్వునయ్యాను. కలగానే నాలో దాగిఉన్న రహస్యాలు నాకు కనిపిస్తాయి గనుక ! కలలో నాకు స్ఫురించింది , మట్టీ నీరూ గాలీ ఒకే వస్తువుకు రూపాంతరాలని ఆ మూటి తాత్త్విక అంశాలూ నాలోనే ఉన్నాయనీ–

ఈ భావోదయంలో ఒకటిగా ఉన్న నేను మూడుగా మారాను! '

అని తననుతాను తెలుసుకున్న శేషేంద్ర చిన్ననాటినుంచే కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు ఆకర్షితుడై, క్రమంగా అభ్యుదయ కవుల సంపర్కంలో తనలో తాను తర్కించుకుంటూ 1964 నాటికి విప్లవ కవిగా గుర్తింపబడ్తున్న సంధిసమయంలో ముఠాలుగా కవులూ అకవులూ సమ్మిళితులై సాహిత్యాన్ని రాజకీయాలు శాసిస్తున్న కాలంలో ఆత్మవివేచనతో అసలైన కవిత్వం ఏదో, ఏమిటో స్పష్టంగా తెలిసిన పండితునిగా అకవులను అస్సలే దగ్గరకు రానీయని శేషేంద్ర అనేకమంది ' పట్టు కవుల ' ద్వేషాలకూ, విరోధాలకూ లోనై అప్పటిదాకా తాను నడచిన దారిలో తాను గుర్తించిన కొందరు యువకవులను సమీకరించి నిర్దుష్టమైన లక్ష్యాలే గమ్యంగా శక్తివంతమైన కవితలనే ఆయుధాలుగా ధరించిన సాయుధ అక్షరకారులతో ' కవిసేన 'ను స్థాపించాడు . 1971లో మొదలైన ఈ ఆవేదన అప్పటిదాకా వెలువరించిన మండే సూర్యుడు, శేషజ్యోత్స్న, రక్తరేఖ, నాదేశం– నా ప్రజలు , గొరిల్లా వంటి కావ్యాలూ, కృతులూ ప్రజల్లోకి తమదే ఐన ఒకానొక కొత్త చైతన్యశక్తితో విజృంభిస్తూ గర్జిస్తున్న కాలంలో కవిసేన ఆవిర్భావం ఒక కొత్త అంతర్జ్వలనతో కవిత్వానికి ఒక శాస్త్రస్థాయిని కల్పిస్తూ ' 1977 నాటికి ' కవిసేన మేనిఫెస్టో' ఆధునిక కావ్యశాస్త్రంగా .. కొత్త కవుల తరం ఒకదాన్ని ఆవిర్భవింపజేశాడు. దీనితో అప్పటిదాకా నిర్వచించబడ్డ సామాజిక అంశాలన్నీ పునర్నిర్వచించబడి.. కొత్త కవుల తరానికి ' కవిసేన ' ఒక దిశానిర్దేశం చేసింది. అప్పుడే శేషేంద్ర ఆ మేనిఫెస్టోలో దాని ' ఆశయాలు– నియమాలనూ ప్రకటించాడు. వీటిప్రకారం., 1) మనిషి ఆలోచించే జంతువని నిర్వచించారు శాస్త్రజ్ఞులు; మనిషి కన్నీరు కార్చే జంతువంటుంది కవిసేన– 2) మనిషి పనిముట్లు చేసే జంతువన్నాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్; మనిషి ఆయుధాలు చేసే జంతువంటుంది కవిసేన– 3)ఆకాశంలో మెరిసే విద్యుత్తును భూమండలానికి తెచ్చాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్; నరలోకంలో మెరిసే కన్నీటిని నక్షత్రలోకాల కెత్తుదామంటుంది కవిసేన– ఈ రకంగా హృదయమున్న మనుషులను మాత్రమే మనుషులుగా పరిగణించిన కవిసేన శుద్ధ మానవీయ దృక్పథంతోనే కేవలం రెండే రెండు పుటల నిడివిగల ' ఆశయాలు–నియమాలు ' ను ప్రకటించింది. ఈ రెండు పుటలు రాస్తున్నపుడు శేషేంద్రతో వ్యక్తిగతంగా నేనున్న ఆయన వెంట. చివర్లో షరా:– అని ఒక ప్రత్యేక నోట్ రాశాడు.. ఇది రాజకీయ ఉద్యమం కాదు. ఇది ప్రత్యేకంగా వైజ్ఞానిక ఉద్యమం. కవికి రాజకీయాలతో సంబంధం ఉంటుంది, కాని రాజకీయ పార్టీలతో ఉండదు. రాజకీయ పార్టీలవాళ్ళు సభ్యులుగా ఉండవచ్చునుగానీ మూలభూతమైన కవిసేన ఆశయాలకు లోబడి మాత్రమే ఉండగలరు.

కవికి తాను రాసేప్పుడుగానీ, మాట్లాడేప్పుడు గానీ, కార్యాచరణలో మగ్నమై ముందుకు సాగుతున్నప్పుడుగానీ చాలా స్పష్టత అవసరమని పదే పదే చెబుతూండేవాడు శేషేంద్ర అప్పుడు నిండుయవ్వనంలో ఉన్న నాలాంటి యువకవులతో.

కవిసేన 1977లో ప్రభవించిన తర్వాత అనేకానేక కారణాలవల్ల, చిత్తశుద్ధి లేని కవిసైనికుల వల్లకూడా కొన్ని అవరోధాలు ఏర్పడ్డాయి. అది వేరే విషయం. సంస్థల నిర్మాణం వేరు.. వాటి నిర్వహణ వేరు.

'నా దేశం – నా ప్రజలు' రాస్తున్న కాలంలో శేషేంద్రతో చాలా సన్నిహితంగా గడిపే అవకాశం నాకు దొరికింది ఛందో. నియమాల చట్రాలను విడిచి స్వచ్ఛంధ పద్యం పురుడుపోసుకుంటున్న దశలో వర్స్ (verse) ను పద్యం అనాలా, పోయెం అనాలా, పూర్వకాలపు సుప్రతిష్ఠిత ఛందస్సును విడిచిపెట్టి ఏ కవికి ఆ కవి తనకు సందర్భానుసారం స్ఫురించిన లయను అనుసరించి కవితా రచన చేయడం, అట్టి లయాత్మక గతి విధానాన్ని ఫ్రెంచ్‌లో వర్స్‌లిబర్ అంటే దానికి ఇంగ్లిష్ అనువాదం మనవాళ్ళు ఫ్రీవర్స్ అంటున్నారు. లయాత్మకత లేనప్పుడు కవితయొక్క ధారణ సమస్య ఉత్పన్నమౌతుంది. వచన కవులు చాలామంది తమ కవితలను వేదికపైకెక్కగానే జేబులోనుండి ఒక కాగితాన్ని తీసి విప్పుకుని చూస్తూ దాన్ని చదవడాన్ని మనం గమనించవచ్చు. సంగీతాత్మకత, లయా లేని పద్యపాద నడక ధారణకు లొంగకపోవడమే ఈ స్థితికి కారణం. దీన్ని దృష్టిలో పెట్టుకునే వర్స్‌లిబర్, స్వచ్ఛంద కవిత, తదనంతర వచన కవిత రూపాంతరతలతో వృద్ధి చెందుతూ వస్తున్న క్రమంలో.. ఒక విషయం జ్ఞాపకమొస్తూ ఉంటుంది. విఖ్యాత ఫ్రెంచ్ సిబలిస్ట్ చతుష్టయం ఐన బోదిలేర్, వెర్లాయిన్, మల్లార్మే మరియు రెంబో లలో వెర్లాయిన్ అంటాడు. verse must be musical అని. కవిత రాగాత్మకత, సంగీతాత్మకత, లయాత్మకత మరియు వ్యంజనతో కూడి సంయుక్తమైనప్పుడే దానికి అపూర్వమైన ధారణకు లొంగే లక్షణం అబ్బుతుందని సూచించాడు.

ఐతే ఈ సంక్లిష్టతలతో తలమునకలౌతున్నప్పుడే ఒక ఘటన జరిగింది. అది శేషేంద్ర తన 1974 లో వెలువడ్డ మండే సూర్యుడు, అదే సంవత్సరం వెలువడ్డ రక్తరేఖ, 1975 లో నాదేశం– నా ప్రజలు, 1976 లో నీరై పారిపోయింది, 1977 లో గొరిల్లా, శేషజ్యోత్స్నతో కలిపి ఆధునిక మహాభారతం పేర 1986లో ప్రచురిస్తున్న కాలంలో.,

21-02-1986 సాయంకాలం హైదరాబాద్" లో ఇండోసోవియట్ స్నేహసమితి ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టి సమావేశానికి రష్యన్ కవి డేవిడ్ గుల్బినోవ్ వస్తున్నారని తెలిసి శేషేంద్రతో కలిసి నేనూ వెళ్ళాను. రష్యాలో భాషావ్యామోహం మెండు. వాళ్ళు పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో కూడా అన్ని సబ్జెక్టులలో రష్యన్ భాషలోనే పాఠ్యపుస్తకాలను తయ్యార్ చేసుకున్నారు ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి వృత్తివిద్యా రంగాల్లోకూడా. అందువల్ల గుల్బినోవ్ గారితో సంభాషించడానికి ఉస్మానియా యూనివర్సిటీలో రష్యన్ లెక్చరర్ ప్రతిమాదేవి, తెలుగు మహిళ గారిని దుబాసిగా నియమించారు. ఆ సమావేశంలో సుప్రసిద్ధ తెలుగు కవి గజ్జెల మల్లారెడ్డి, కొత్తపల్లి వీరభద్రరావు, ప్రసిద్ధ కవి పోతుకూచి సాంబశివరావు ఇంకా ఆసక్తి ఉన్న హిందీ ఉర్దూ కవులున్నారు. " అప్పుడు "డేవిడ్ గారూ మీరు రాసే కవిత్వం పాడబడ్తుందా చదువబడ్తుందా? " అని అడిగాడు ఒక పెద్దాయన.. అప్పుడే మంద్రస్వరంలో శేషేంద్ర గుసగుసగా గజ్జెలగార్ని అడిగాడు" ఎవరండీ ఆ పెద్దాయన" అని. అప్పుడు " అయ్యో ఆయననెరుగరా.. జగమెరిగిన బ్రాహ్మడు చాగంటి సోమయాజులు.. చాసో'' అని గుసగుసగానే జవాబు. అప్పుడు శేషేంద్ర అందుకుని "నేను పెద్దాయన చాసో గారి వ్యాఖ్యాతగా అడుగుతున్నాను.. డేవిడ్‌గారూ,మీ రచన లయాత్మక రచనా లేక పొడి వచన రచనా" అన్నాడు. దానికి "లయాత్మక రచనే లిలి అని జవాబు.

"మీరు లయరహిత వచన కవిత రాయలేదా"

" లేదు"అని జవాబు.

"ఐతే రష్యన్ కవులలో ఎవరూ వచన కవిత్వం రాయరా" అని మళ్ళీ అడిగారు.

అందుకు డేవిడ్ గారు " రాస్తారు. కానీ వాళ్ళు బహుశా 100 కి ముగ్గురు ఉండవచ్చు" అన్నారు.

" అలా ఎందుకని"

" అది మాలో లోకప్రియ పద్ధతి (popular) కాదు."

" అంటే వాళ్ళు మాకంటే బ్యాక్‌వర్డ్ అన్నమాట" అని జోక్ వేస్తూ గజ్జెల మల్లారెడ్డిగారు లేచారు.

అప్పుడే బయటికి వస్తున్నపుడు వచన కవిత్వాన్ని ఒక ఉద్యమంగా ప్రచారం చేసిన విఖ్యాత ఫ్రెంచ్ సింబలిస్ట్ కవుల్లో ఒకడైన రేంబోను ఉటంకిస్తూ అతనన్న ఒక ప్రాణప్రదమైన వాక్యాన్ని చెప్పాడు శేషేంద్ర . అది.. " The hand with the pen is no better than the hand on the plough"అర్థం – కలం పట్టుకున్న చెయ్యి నాగలి పట్టుకున్న చేతికంటే గొప్పదేమీ కాదు..అని. ఇదే కవిసేన ఆవిర్భవానికి ప్రాతిపదిక.

**ఈ నదులు ఈ కొండలు ఈ దేశం ఎవరిది**
**పనిచేసిన కూలీతో బ్రతుకుతున్న ప్రజలది**
**ఈ దేశపు వీధుల్లో నడిచే హక్కెవరిది**
**స్వేదబిందువుల దండలు వేసుకున్నవారిది**
**రచిత అక్షరంకంటే రాయే అతిశ్రేష్టము**
**వేళ్ళు కాళ్ళయి నడిచే చెట్టు మనిషి**
**చెట్టుగా ఉంటే ఏదాదికొక వసంతమన్నా దక్కేది;**
**మనిషినై అన్ని వసంతాలనూ కోల్పోయాను!**
**(ఒకటో సర్గ)**

**నా చేతులతో నేనే నన్ను**
**ఒక నిశ్శబ్ద సమాధిలో పాతిపెట్టలేను**
**ఒక పర్వత బ్రహ్మలా కూర్చో ఉండలేను**
**నన్ను చేయెత్తి పలికిస్తున్న క్షణాన్ని**
**వట్టి నిట్టూర్పులకు వదిలేసుకోలేను**
**కొండలతో సముద్రాలతో కలిసి బ్రతికేవాడిని**
**నాకు తుఫానులొక లెఖ్ఖా!**
**తుఫానులు తుఫానులే ఎగిరిపోతున్నాయి**
**ఈగల్లా ఎగిరే ఈ క్షుద్ర బాధలొక లెఖ్ఖా–( ఒకటో సర్గ)**

**చివరకు రాలేముందు తెలుసుకుంటుంది ఆ పండు**
**చెట్టు గింజ తన కడుపులోనే ఉందని**
**చెట్టనుకునే ' నేను ', పండనుకునే ' నేను '**
**రెండూ ఒకటేననీ! (మూడో సర్గ )**

**ఈ భూమండల మార్గాల్లో ఒంటరిగా నడువలేను**
**నా బ్రతుకు వెయ్యి విధాలుగా నీవనే ఒక నాజూకు**
**నూలు పోగుల జాలంతో అల్లిన దుకూలం–**
**భార్యగా, నెచ్చెలిగా,**
**ప్రేయసిగా,**
**మాతృదేవతగా, చంటి బిడ్డగా**
**ఒకటేమిటి నా సర్వస్వంగా–**

**నా ముందున్న దూరాలు**
**దాటడానికి కావలసిన బలాన్ని ఇస్తావు నీవు;**
**మనిద్దరమూ కలిసి మన**
**ప్రజల అంతిమ సమరాన్ని గెలుస్తాము–**
**( నాలుగో సర్గ)**

నీకు తెలుసా ఆకలి ఉందనీ, నీకు తెలుసా దప్పిక ఉందనీ; అవి రెండూ నీ విలువైన స్వేచ్ఛ మాంసం తిని బ్రతికే క్రూర మృగాలని నేను నీ జాతి గొంతునై చెపుతున్నాను, విను! వాటి బారినుండి నీవు తప్పించుకోవాలంటే, మీ నాన్న బొమ్మలూ బొమ్మల పుస్తకాలూ తెచ్చి ఇస్తే తీసుకోకు. తిరస్కరించు. పొలాలిమ్మను ఫ్యాక్టరీలిమ్మను. అవే నీ ఆటవస్తువులని చెప్పు. మీ నాన్న తేలేకపోతే దేశంలో ఉన్న నాన్నలందర్నీ ఏకం కమ్మను.

'నా దేశం– నా ప్రజలు' అనబడే ఆధునిక ఇతిహాసం 1975 లో ప్రభవించి ఈ దేశ పేద జనంకోసం, ప్రజల్లో ఒక గాండీవం వంటి ఆయుధమై నిత్య చైతన్యాన్ని ఉద్దీపిస్తూ.. దీనజనులకు ఊపిరై, ధైర్యమై, ప్రాణమై 'నీలో నేనున్నాను' అని మనిషిని మహాసముద్రుణ్ణి చేసే కవితాశక్తిని ఋజువు చేసింది. అనేక భారతీయ భాషల్లోకి అనువాదమై, అంతర్జాతీయ వేదికపై ఇంగ్లిష్‌లో తనదైన స్వచేతనతో ' నోబెల్ ' పురస్కారార్థం నామినేట్ చేయబడి శిఖరాయమాన దీప్తితో 2025 నాటికి యాభై ఏళ్ళు పూర్తి చేసుకుని ప్రజా సాహిత్య సంపదగా మిగిలిపోతున్న చారిత్రాత్మక ఘట్టం ఇది. ఈ సందర్భంగా శేషేంద్రశర్మ స్వయంగా తానే చెప్పినట్టుగా.. కవి జీవితకాలమంతా ఒకే ఒక రచనను మాత్రమే సృజిస్తాడనుకుంటే.. 'ఆధునిక మహాభారతం' గా రూపాంతరం చెందిన శేషేంద్ర అతని వివిధ కృతుల్లో ప్రవచించిన ఆయుధతుల్య కవితా పంక్తు లను మరొక్కసారి పునఃమననం చేసుకుందాం.

**'నా దేశం– నా ప్రజలు' అనబడే ఆధునిక ఇతిహాసం 1975లో ప్రభవించి ఈ దేశ పేద జనంకోసం, ప్రజల్లో ఒక గాండీవం వంటి ఆయుధమై నిత్య చైతన్యాన్ని ఉద్దీపిస్తూ.. దీనజనులకు ఊపిరై, ధైర్యమై, ప్రాణమై 'నీలో నేనున్నాను' అని మనిషిని మహాసముద్రుణ్ణి చేసే కవితాశక్తిని ఋజువు చేసింది.**

'నీకు తెలుసా! వ్యవసాయ కూలీల ఆకాశం వర్షాలే కురుస్తుంది కానీ వసంతాలు కురవదు '

**'సముద్రం ఒకడి కాళ్ళదగ్గర కూర్చుని మొరగదు**
**తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు**
**పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు–**
**నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు–** కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది. కష్టాల్ని కన్నీటిలో ముంచుకుని బిస్కెట్లలా తింటాను. బ్రతుకంటే బలవంతుడైన వాడే శబ్దం నుంచి శతాబ్దం వరకూ మలిచే శిల్పి అని ఆవిష్కరిస్తాను.'

'గంగానది మొదట ఒక దేవత, తర్వాత పడవల రస్తా, ఆ తర్వాత మన పొలాల్లోకి పారే పంటకాలువ. చూశావా, కాలం చేతుల్లో దేవతల రూపాలుకూడా మారుతాయి–' ( గొరిల్లా) 'ఒక్క రాగం విసిరి బుల్ బుల్ తోట తోటనం తా తన చిన్ని రెక్కలమీద ఎగరేసుకు పోతుంది '

ఇటువంటి నిప్పులు చిమ్మే, అమృతధారలను కురిపించే రసరమ్య కవితా పాదాలూ, పంక్తులూ కోకొల్లలు శేషేంద్ర కావ్యాలనిండా. చదువరులు శక్తిమేరకు కురిసిన అక్షర నక్షత్రాలను ఏరుకుని పదిలంగా దాచుకోవడమే ఇక.

ప్రపంచ కవితా చక్రవర్తికి 2025 ఒక స్వర్ణకిరీటం.

(మే 30న శేషేంద్ర వర్ధంతి సందర్భంగా )



– ప్రొఫెసర్
రామా చంద్రమౌళి
919390109993



## శిక్షణ తరగతులు జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగం

### – ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

వరంగల్, మే 29:పాత్రికేయులకు శిక్షణ తరగతుల




వల్ల మరింత విజ్ఞానాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని అటవీ శాఖ వనమాలిక వద్ద తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం, అటవీశాఖ సౌజన్యంతో నిర్వహించిన రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణ తరగతుల్లో శ్రీనివాసరెడ్డి ప్రారంభ ఉపన్యాసం చేశారు.

జర్నలిస్టులకు జ్ఞానం పెంపొందించుకునేలా, వివిధ అంశాలతో కూడిన 10 పుస్తకాల కిట్లును ప్రెస్ అకాడమీ తరుపున అందిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ కూచుకుల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ తరగతులతో క్వాలిటీ జర్నలిజంపై అవగాహన జ్ఞానం పెరుగుతుందని అన్నారు. స్థానిక సమస్యలను, అవసరాలను ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా వార్తలు రాయడం వల్ల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

కార్యక్రమంలో ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్ వి రామారావు, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి, రాములు, తెలంగాణ మీడియా సిబ్బంది పూర్ణచంద్రరావు, మేనేజర్ శనేశ్వర రెడ్డి, ఓఎస్డీ రెహమాన్, ఐజేయు రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ తదితరులు హాజరయ్యారు.

## టీజేఎఫ్ రజతోత్సవ సభకు తరలిరండి.

### –ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల, 29: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీజేఎఫ్ వ్యవస్థాపకులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 31 శనివారం రోజున హైదరాబాద్ జలవిహార్ లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభనకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి జిల్లా నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని టియూడబ్ల్యూజే (హెచ్ 143) జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహ్మద్ రఫీక్ పిలుపునిచ్చారు. వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆనాటి సీనియర్ పాత్రికేయులు అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఏర్పాటు చేసుకొని జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఆనాడు ఏర్పడిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సభను హైదరాబాద్ జల విహార్ ఆడిటోరియంలో మే 312025న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారని,ఈ సభను విజయవంతం చేయడానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు కదలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆయాచితుల జితేందర్, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, జిల్లా రమేష్, దేవరాజ్, ప్రచార కార్యదర్శి షేక్ రియాజ్, కోడం గంగాధర్, హరీష్, విష్ణు, రాజేందర్, చౌటుపల్లి వెంకటేష్, దెబ్బేటి ప్రవీణ్, ఆసిమొద్దీన్, సంతోష్ అజారుద్దీన్,ఇమ్రాన్, ఫహాద్ పాషా, సల్మాన్, శ్యామ్, షోయబ్ లతోపాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయం మూసివేత పై తప్పుడు ప్రచారం..ఇప్పట్లో ఆలయాన్ని మూసివేసేది లేదన్న ఈవో

### –సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రచారాన్ని నమ్మవద్దని సూచన

రాజన్న సిరిసిల్ల, 29: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజన్న ఆలయాన్ని జూన్ 15 నుండి మూసివేస్తామని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు మూసివేస్తున్నట్లుగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వేములవాడ పేరిట ప్రకటనలు తిప్పుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, దానిని పూర్తిగా తప్పుడు కథనంగా ఆయన ఖండించారు.

రాజన్న ఆలయాన్ని ఇప్పట్లో మూసివేసే అవకాశం లేదని ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు.

ఇలాంటి తప్పుడు ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న వారిని కఠినంగా శిక్షించి తగిన చర్యలు తీసుకోవాలని వేములవాడ పట్టణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జూన్ 15 నుండి ఎలాంటి బంద్ లేదని యథావిధిగా రాజన్న ఆలయం లో భక్తులకు అన్ని స్వామివారి నిత్య సేవలు అందుబాటులో ఉంటాయని ఈవో వినోద్ రెడ్డి స్పష్టం చేశారు.

## మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలి.. వన మహోత్సవంపై అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



హైదరాబాద్, మే 29: వన మహోత్సవాన్ని ఈ ఏడు విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవంపై గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కమీషనర్లతో సమీక్ష సమావేశాన్నినిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే మొదలైనందున ఈ సారి మొక్కలు నాటే కార్యక్రమం వన మహోత్సవాన్ని మొదలు పెట్టాలని సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. మొక్కలను రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ సంస్థల్లో విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలన్నారు.

పండ్లు, ఔషధ మొక్కలతోపాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు చెప్పారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా (టీజీఎఫ్ ఎంఐఎస్) వెబ్‌సైట్‌లో ప్రతీరోజు నమోదు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాంబశివరావు, జిల్లా అటవీ శాఖాధికారి జానకిరాం, పర్యాటక శాఖాధికారి శ్రీధర్, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాస్ మూర్తి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, హౌజింగ్ పిడి రమణ మూర్తి, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, అటవీ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## జూరాలకు భారీ ఇన్ ఫ్లో.. 10 గేట్లు ఓపెన్ !

జోగులాంబ, మే 29గద్వాల జిల్లాలోని జూరాల ప్రియదర్శిని డ్యామ్‌కు భారీగా వరద వస్తున్నది. ఈరోజు (గురువారం) సాయంత్రం వరకు ఎగువ నుంచి 80వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో జూరాల డ్యామ్ పదిగేట్లు ఎత్తివేసి దిగువకు 82,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా.. అలాగే, పరిసర ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో కృష్ణా నదికి వరద ఉధృతి పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉప నదులకు వరద ఉధృతి పెరిగింది. ఫలితంగా వరద నీరంతా వచ్చి కృష్ణా నదిలో కలుస్తోంది. ప్రస్తుతం 80వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. రేపటి వరకు వరద లక్ష క్యూసెక్కులు దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే ముందస్తుగా జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



రాజన్న సిరిసిల్ల, 29: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ మాజీ అధ్యక్షులు "బత్తుల దేవరాజు" గుండె పోటుతో మరణించగా, వారి భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఆటో యూనియన్ నాయకులు, మిత్ర బృందం నివాళు లర్పించారు. వారి వెంట మాజీ కౌన్సిలర్లు నరాల శేఖర్, జోగిని శంకర్, సిరిగిరి చందుడ అంజత్ పాషా,వాసు మహేందర్ తదితరులు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com